

"పట్టణ పేదల ఇంటి కష్టాలను తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు కోసం ఆధునిక టెక్నాలజీతో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను చేపట్టారు. అప్పట్లోనే చాలావరకు నిర్మాణాలు పూర్తి చేసుకోగా.. కొన్నిదగ్గర్ల గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతోనే టిడ్కో పనులను నిలిపివేసింది. అంతకు ముందు పూర్తి అయిన ఇళ్లను కూడా పంపిణీ చేయలేదు. దీంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నా.. వైసీపీ పాలకులు తమకు ఇళ్లు పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆందోళనలు చేసినా ఎన్నికల ముందు వరకు స్పందించలేదు. ఎన్నికల సమయంలో హడావుడిగా పంపిణీ చేపట్టారు. అయితే కొన్నిదగ్గర్ల సక్రమంగా వసతులు కల్పించలేదు. మరికొన్నిదగ్గర్ల పనులు పూర్తిగా జరగలేదు. దీంతో చాలామందికి ఇంటి కాగితాలు చేతికి వచ్చినా ఇళ్లలో చేరలేదు. చేరినవారు అక్కడి సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. అయితే మళ్లీ టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తమ ఇంటి కల నెరవేరుతుందని టిడ్కో లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు."



అడవితక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్లు

ఆంధ్రజ్యోతి ఫోకస్

ఇల్లు.. ఇస్తారా?

- కలగానే టిడ్కో గృహయోగం
- ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఎన్నికలకు ముందు హడావుడిగా పంపిణీ
- సౌకర్యాలు లేక ఇళ్లలో లబ్ధిదారుల అవస్థలు

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

గత టీడీపీ ప్రభుత్వం పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 33,264 మంది పట్టణ పేదల కోసం ఆయా మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే. వీటిలో గత ప్రభుత్వం 25,228 గృహాల నిర్మాణాల్ని పూర్తి చేసింది. 8,036 గృహాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఆధునిక పరిజ్ఞానంతో పేదల కోసం నాటి ప్రభుత్వం ఇళ్లను నిర్మించింది. అద్దె ఇంటి కష్టాలు తప్పుతాయి.. సొంతింట్లో సంతోషంగా ఉండవచ్చని లబ్ధిదారులు ఆశిస్తున్న తరుణంలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్ల పనులను నిలిపివేసింది. మౌళిక వసతుల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించడంలో కాలయాపన చేసింది. ఇళ్లు ఇవ్వండి మహాప్రభో అని లబ్ధిదారులు వేడుకున్నా.. అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ రంగులు వేయడంతో సరిపెట్టారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గత ఏడాది చివర్లో వైసీపీ ప్రభుత్వం హడావుడిగా కొన్ని ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఇళ్లను అందజేసింది. అయితే అక్కడ మౌలిక వసతులు, సౌకర్యాలు, సరైన రక్షణ చర్యలు లేవు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లోని సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఇళ్లు ఇస్తే తమ అద్దెంటి కష్టాలు తీరుతాయని ఎదురుచూస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా కొన్ని మున్సిపాలిటీల్లో టిడ్కో ఇళ్ల ప్రాంగణాల్లో మౌలిక వసతుల కల్పనపై ఇప్పటికీ అధికారులు మౌనంగానే ఉన్నారు. అక్కడ తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక వసతులు ఎప్పటికి కల్పిస్తారో.. తమకు ఎప్పటికి ఇళ్లు అందుతాయోనని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు.

అనేక ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు బూజుపట్టగా, టిడ్కో ఇళ్ల ప్రాంగణాలు పిచ్చిచెట్లతో అడవులను తలపిస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న ప్రాంతాల్లో అయితే ఇనుప చువ్వలు తుప్పు పట్టిపోయాయి.

సౌకర్యాలు నాస్తి..

గుంటూరు: ఏళ్లుగా గుంటూరులోని పట్టణ పేదలు సొంత ఇంటి కల నేరవేడంలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అడవితక్కెళ్లపాడులో 4750 టిడ్కో గృహాలు మంజూరు కాగా అప్పట్లోనే 1100 ఇళ్లను నిర్మించారు. ఇంటి కోసం అప్పు చేసి చెల్లించిన వాటా ధనానికి వడ్డీ ఒకవైపు.. ఉంటున్న ఇళ్లకు అద్దెలు చెల్లించలేక మరోవైపు భారం పడుతుందని లబ్ధిదారులు వాపోతున్నా ఇంతకాలం పాలకులు ఆలకించలేదు. పార్టీ రంగులు వేయడంలో చూపిన శ్రద్ధ పనులు పూర్తి చేయడంలో, వసతులు కల్పించడంలో జగన్ ప్రభుత్వం చూపలేదు. ఎన్నికలకు ముందు పంపిణీ చేసిన ఇళ్లలో నివాసాలకు సరైన సౌకర్యాలు లేక లబ్ధిదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని ఇళ్లకు కిటికీలు, తలుపులు దెబ్బతినిపోవడం, భూగర్భ విద్యుత్ తీగలు కాలిపోయి, ప్రమాదకరంగా మారడం వంటి ఇబ్బందులతో లబ్ధిదారులు గృహప్రవేశాలకు సాహసం చేయలేదు. తక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్లకు తాగునీరు సరఫరా సక్రమంగా జరగడంలేదు. విద్యుత్ వసతి కూడా సక్రమంగా లేదు. తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

అందని ద్రాక్ష

తెనాలి: నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలో ఉండలేరు. మంజూరయిన ఇళ్లలో ఉందామంటే పనులు పూర్తికావు. టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని గత టీడీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటే వైసీపీ పాలకులు పంతానికిపోయి గాలికొదిలేశారు. తెనాలి పరిధిలో జగ్గడిగుంటపాలెం దగ్గర 848 ఇళ్లు, పూలే కాలనీలో 1008 ఇళ్ల నిర్మాణం మొదలుపెట్టారు. జగ్గడిగుంటపాలెం వద్ద అప్పట్లోనే 848 ఇళ్లు పనులు పూర్తి చేశారు. 2019 ఎన్నికలకు ముందే లబ్ధిదారులకు కేటాయించగా వైసీపీ ప్రభుత్వం పేర్లు మార్చేసింది. విద్యుత్ సదుపాయం లేక చాలాకాలం అంధకారంలో ఉంటే, కరోనా సమయంలో ఆ ఇళ్లను క్వారంటైన్ కేంద్రాలుగా వాడారు. ఇప్పుడు ఇక్కడ కొంతమంది నివాసం ఉంటున్నా సరైన రోడ్లు, పరిసరాల అభివృద్ధిలేక జనం దోమలు, పాములతో కలిసే జీవనం సాగిస్తున్నారు. పూలే కాలనీలోని టిడ్కో ఇళ్ల పనులు గత ఐదేళ్లుగా ముందుకు సాగలేదు. 40 నుంచి 70 శాతం వరకు పూర్తయిన ఇళ్లను పూర్తిచేస్తే లబ్ధిదారులకు సొంత గూడు కల నెరవేరుతుంది.



అడవితక్కెళ్లపాడులోని టిడ్కో ఇళ్లు



తెనాలి: మధ్యలో ఆగిపోయిన ఇళ్లలో అడుగు పెట్టే వీలులేనట్టు పెరిగిపోయిన ముళ్ల కంప

పంపిణీ ఎప్పటికో?

నరసరావుపేట: టీడీపీ హయాంలో 2018లో 1504 గృహాలను నరసరావుపేటలో నిర్మించారు. ఇళ్లు నిర్మించి.. వసతులు కల్పించి ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు పంపిణీ చేయలేదు. గృహాల పంపిణీపై అధికారులకే స్పష్టత లేదు. సొంత ఇంటి కోసం లబ్ధిదారులు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా వీరి మొర ఆలకించే వారే కరువయ్యారు. లబ్ధిదారుల ఎంపికలో అక్రమాలు చోటు చేసుకున్నాయని గతంలో 285 లబ్ధిదారుల పేర్లను తొలగించడంతో వారు కోర్టును ఆశ్రయించారు. ఈ పరిస్థితుల్లో పాత వారికే ఇళ్లు కేటాయించాలని కోర్టు మధ్యంతరం ఉత్తర్వులు ఇచ్చింది. అయినా సదరు పేదలకు ఇళ్లను కేటాయించే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారు. వాటా ధనం చెల్లించిన 580 మంది లబ్ధిదారులకు ఇళ్లు కేటాయింపుపై సందిగ్ధత నెలకొంది. ప్రస్తుతం 82 కుటుంబాలు మాత్రమే నివాసం ఉంటున్నాయి. మిగిలిన ఇళ్లు ఏళ్లుగా పంపిణీ జరగకపోవడంతో పాడుబడే పరిస్థితులు నెలకొనున్నాయి.



నరసరావుపేటలో పంపిణీకి నోచుకోని టిడ్కో గృహాలు

ఎదురు చూపులు

పొన్నూరు: టిడ్కో గృహ సముదాయాల్లో ఇళ్లకోసం లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. 2016లో 57 బ్లాకుల్లో 2368 గృహాలను ప్రభుత్వం మంజూరు చేసి పనులను ప్రారంభించింది. రెండేళ్లలోనే 85 శాతం పనులు పూర్తి అయ్యాయి. 2019 నుంచి మిగిలిన పనులు చేపట్టలేదు. లబ్ధిదారుల ఎంపిక జరిగినా వివిధ కారణాలను చూపి వైసీపీ పాలకులు ఇళ్ల పనులను ఆపేశారు. నిర్మాణం పూర్తి అయిన గృహాలను 2023లో పంపిణీ చేసినా 160 మందిని జాబితా నుంచి తొలగించారు. 300 చ.ద.అ గృహాలు 480 ఉండగా కేవలం 407 మంది మాత్రమే పంపిణీ చేశారు. 365 చ.ద అడుగుల గృహాలు 1648 ఉండగా 1220 మందికి గృహాలు రిజిష్టర్ కాగా 1056 మందికి పంపిణీ చేశారు. 430 చ.ద. అడుగుల గృహాలు 240 ఉండగా 178 ఇళ్లను రిజిష్టర్ చేసి 164 ఇళ్లను మాత్రమే లబ్ధిదారులకు అందచేశారు.



పొన్నూరులోని టిడ్కో గృహాలు

70 శాతం పూర్తి

వినుకొండ: పట్టణంలో 2018లో అప్పటి మంత్రి నారాయణచే ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్లకు శంకుస్థాపన జరిగింది. 4096 గృహాలు మంజూరుకాగా తొలిదశలో 1400 గృహాలు నిర్మించడానికి అధికారులు శ్రీకారం చుట్టారు. వీటిలో 200 గృహాలు 70 శాతం పూర్తిగా మిగతావి శంకుస్థాపన దశలో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం 2023 తర్వాత 700 గృహాల పనులు చేపట్టింది. ఇవి 70 శాతం పూర్తి అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు వేగవంతమయ్యాయి. డిసెంబరు 31కి సింగిల్ బెడ్‌రూమ్‌లు గల 720 ఇళ్లు పూర్తి చేసి ఇస్తామని అధికారులు తెలిపారు. టిడ్కో గృహాల నుంచి సుమారు 18 అడుగుల వెడల్పుతో 800 మీటర్ల రోడ్డు నిర్మించాలి.



వినుకొండ: పేదలకు పంపిణీ చేసేందుకు సిద్ధమవుతున్న టిడ్కో గృహాలు



- ఏపీకి కలిసిరానున్న చంద్రబాబు అనుభవం, పవన్ ఆవేశం
- కూటమి ప్రభుత్వ ఏర్పాటు రాష్ట్రానికి సువర్ణావకాశం
- నరసరావుపేటలో విజయనిర్మల విగ్రహ ప్రతిష్ఠ నా కల
- కళాకారులను ప్రోత్సహించేందుకు నంది అవార్డులు ఇవ్వాలి
- చిత్రం భళారే విచిత్రం, శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ -2లకు ప్లాన్
- ఆంధ్రజ్యోతితో సినీనటుడు నరేష్

పదేళ్లలో ప్రథమస్థానం

ఆంధ్రజ్యోతితో అతిథి

నరసరావుపేట కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అనుభవం.. పవన్‌కల్యాణ్ ఆవేశం కలగలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పదేళ్లలో ప్రథమ స్థానానికి చేరుకుంటుంది. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రాజధాని అమరావతి శిథిలావస్థకు చేరింది. ప్రధాని మోదీ ప్రోత్సాహం, చంద్రబాబు సామర్థ్యంతో అమరావతి పునర్నిర్మాణం జరగడం తథ్యం. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కావడం రాష్ట్రానికి సువర్ణావకాశం.. అని సినీనటుడు నరేష్ తెలిపారు. స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన ఆదివారం ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. సినీ ప్రస్థానం నుంచి రాజకీయాల వరకు ఆయన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..

● సినీ ప్రస్థానం

నా పదో ఏట పండంటి కాపురం సినిమాతో అరంగేట్రం చేశాను. అది మొదలు ఇప్పటివరకు నటిస్తూనే ఉన్నాను. నటప్రస్థానం 50 యేళ్లు పూర్తిచేసుకుంది. ఇప్పుడు హీరోగా రెండు మూడు సినిమాలు చేస్తూ హైసక్సెస్ రేట్‌లో ఉన్నాను. క్యారెక్టర్ ఆర్టిస్టుగా కొన్ని సినిమాలు చేస్తున్నాను. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వంలో యునైటెడ్ నేషన్స్ అంబాసిడర్‌గా ఉన్నాను. గతంలో మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సినీ ఇండస్ట్రీ కోసం, కళాకారులకోసం కృషి చేశాను.

● నరసరావుపేటతో అనుబంధం

నరసరావుపేట మా అమ్మవాళ్ల ఊరు. చిన్నప్పుడు వేసవి సెలవుల్లో ఇక్కడికి వచ్చేవాణ్ని. ఇక్కడ మా బంధువులు చాలామంది ఉన్నారు. కొంతకాలంగా ఈ ఊరితో అనుబంధం తెగిపోయింది. అనుకోకుండా ఈ కార్యక్రమంతో మళ్లీ ఇక్కడికి రావడం సంతోషంగా ఉంది. అమ్మ భారతదేశం గర్వించదగ్గ నటిమణి. 46 సినిమాలకు దర్శకత్వం వహించింది. గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న మహిళా దర్శకురాలు. అమ్మకు పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులు రాకపోవడం వెలితిగా అన్పిస్తుంది. తను పెరిగిన నరసరావుపేటలో విగ్రహం పెట్టాలి అనగానే స్థానిక ఎమ్మెల్యే సహకరిస్తానని సభాముఖంగా చెప్పడం సంతోషం. కాపు సంఘం ద్వారా త్వరలో మంచి ప్రదేశం చూసి అమ్మ విగ్రహం ఏర్పాటు చేయించడం జరుగుతుంది. ఇక్కడ అమ్మ విగ్రహం ప్రతిష్ఠించడం నా కల. సహకారం ఇస్తానన్నందుకు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు.

● రాష్ట్రం ఇక సుభిక్షం

ప్రజలందరూ కోరుకున్న రాజధాని అమరావతి పునర్నిర్మాణం జరుగుతుంది. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రం సుభీక్షంగా మారుతుంది. కేంద్రంలో ప్రధాని మోదీ సహాయ సహకారాలు, చంద్రబాబు సమర్థతతో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకెళ్తుంది.

● షూటింగులకి రాయితీలు ఇవ్వాలి

రాష్ట్రంలో సినిమా షూటింగులకు ఎన్నో అనువైన లొకేషన్లు ఉన్నాయి. ఇక్కడ షూటింగులు జరుపుకోవడానికి ప్రభుత్వం రాయితీలు ఇవ్వాలి. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి కాబట్టి సినిమా పరిశ్రమకు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందన్న ఆశాభావం ఉంది. కళాకారులకు ప్రోత్సాహం ఇచ్చేలా నంది అవార్డులు ఇవ్వాలి. నంది అవార్డులు ఇవ్వడం అనేది దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీ. దీనిని మళ్లీ పునరుద్ధరించాలి. ఓటీటీలు రావడంతో థియేటర్ల మనుగడ ప్రశ్నార్థకమైంది. ఇది బాధ కలిగించే విషయమైనా, టెక్నాలజీతో వచ్చే మార్పులతో నడవాలి. చిత్రం భళారే విచిత్రం పార్ట్ 2 స్క్రిప్ట్ వర్క్ జరుగుతుంది. శ్రీవారికి ప్రేమలేఖ పార్ట్ 2 తీయడానికి ప్లాన్ చేస్తున్నాను.

ఓవర్ స్పీడ్.. వరుస ప్రమాదాలు

- ప్రమాదాలకు నెలవుగా మారిన రింగ్‌రోడ్డు
- తాజాగా రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి
- స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో బైకర్ల ఇష్టారాజ్యం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రింగ్‌రోడ్డు ప్రమాదాలకు నెలవుగా మారింది. రేసులతో బైకర్లు రెచ్చిపోతుండగా.. పాదచారులు, ఇతర ద్విచక్ర వాహన చోదకుల ప్రాణాలకు ముప్పుగా మారింది. ఈ రోడ్డుపై ఎక్కడా స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో బైకర్ల రాకపోకలు ఇష్టారాజ్యంగా ఉన్నాయి. వరుస ప్రమాదాలతో అనేక మంది మరణిస్తుండగా క్షతగాత్రులు అల్లాడుతున్నారు. తాజాగా ఇదే రోడ్డుపై శనివారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. వికాస్‌నగర్ ఒకటో లైన్‌కు చెందిన దాసరి రమేష్(65), నాయుడుపేట ఐదో లైనుకు చెందిన బెల్లగొబ్బుల మల్లేష్(20) మృతి చెందినట్లు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపారు. గతంలో వ్యాపారం చేసి ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉన్న రమేష్ హైదరాబాద్ నుంచి వచ్చిన స్నేహితుడ్ని రైల్వేస్టేషన్‌లో కలిసి శనివారం రాత్రి బైక్‌పై వస్తున్నాడు. కొరిటెపాడు వైపు నుంచి రింగ్‌రోడ్డులో వెళ్తున్న రమేష్ నవభారత్‌నగర్ వద్ద రోడ్డు దాటుతుండగా గుజ్జనగుండ్ల వైపు నుంచి కొరిటెపాడు వైపు మితిమీరిన వేగంతో బైక్‌పై వస్తున్న మల్లేష్ ఢీ కొట్టాడు. ఈ ఘటనలో దాసరి రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మల్లేష్‌ను జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందాడు. మల్లేష్ బీటెక్ మొదటి సంవత్సరం మధ్యలోనే మానేసి బ్రాడీపేటలో గేమింగ్ డిజైన్ కోర్సు నేర్చుకుంటున్నాడు. మాలధారణలో ఉన్న మల్లేష్ శనివారం రాత్రి మారుతీనగర్‌లో జరిగిన అయ్యప్ప భజనకు వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రమేష్‌కు భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. రమేష్ భార్య ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. మల్లేష్ తండ్రి మస్తాన్‌రావు ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.





రమేష్, మల్లేష్ మృతదేహాలు

సేమ్ స్పాట్.. నాడు తప్పిన ప్రాణ ముప్పు

రింగ్‌రోడ్డులోని నవభారత్‌నగర్ మెయిన్ రోడ్డుపై తాజాగా జరిగిన ప్రాంతంలో అదే తరహాలో రెండు వారాల క్రితం ఓ ప్రమాదం జరిగింది. గుజ్జనగుండ్ల వైపు నుంచి కొరిటెపాడు వైపు రేసర్ బైక్‌పై విజయవాడకు చెందిన డెంటల్ విద్యార్థి ఖలీఫా నవభారత్‌నగర్ వైపు వస్తున్నాడు. అదే సమయంలో రోడ్డు దాటేందుకు సిద్ధంగా బైక్‌పై ఉన్న బీటెక్ విద్యార్థులైన బెల్లం పవన్, ముప్పాళ్ళ కౌశిక్‌లను ఖలీఫా ఢీకొట్టడంతో వారు గాయపడ్డారు. ఇదే ప్రమాదంలో మరో మహిళ, చిన్నారి కూడా గాయపడ్డారు. అదేవిధంగా కొద్ది నెలల క్రితం ఇదే రోడ్డులోని చలపతి గ్రౌండ్స్ వద్ద అతివేగంగా వచ్చిన వాహనం ఢీకొని బైక్‌పై రోడ్డు దాటుతున్న కానిస్టేబుల్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ విధంగా రింగ్ రోడ్డులో ఓవర్ స్పీడ్ కారణంగా వరుస ప్రమాదాలు, మరణాలు సంభవిస్తున్నప్పటికీ అటు నగరపాలక సంస్థ అధికారులు కానీ, ఇటు ట్రాఫిక్ పోలీసులు గాని పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శల పాలవుతోంది. అతివేగంతో వాహనాల రాకపోకలు జరుగుతున్నా కనీసం స్పీడ్ బ్రేకర్లు కూడా వేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. గతంలో నగరపాలక సంస్థ అధికారులు ప్లాస్టిక్ స్పీడ్ బ్రేకర్లు వేసినా అవి నెలల వ్యవధిలోనే పాడైపోయాయి. రింగ్‌రోడ్డులో క్రాస్ జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు వేయని పక్షంలో ప్రమాదాలు, మరణాలు ఆగవని తెలుస్తోంది.

క్వింటాల్‌కు రూ.20 వసూలు

- పత్తి రైతులను పీడిస్తోన్న సిబ్బంది
- ఇవ్వకపోతే వేలిముద్రలు వేయని వైనం
- సీసీఐ కేంద్రాల్లో వసూళ్లపై రైతుల ఆగ్రహం



సీసీఐ కేంద్రానికి రైతులు తీసుకువచ్చిన పత్తి నిల్వలు

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు.. తేమ శాతం.. రవాణా.. నిరీక్షణలతోనే ఇబ్బంది పడుతున్న పత్తి రైతులు సీసీఐ కేంద్రాల్లో సిబ్బంది తీరుతో దోపిడీకి గురవుతున్నారు. పత్తి పండించి దానిని విక్రయంచడానికి రైతులు నరకం చూస్తున్నారు. ఏదో ఒక రూపంలో పత్తి రైతులకు వేధింపులు ఎదురౌతూనే ఉన్నాయి. కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే పత్తికి క్వింటాల్‌కు రూ.20 ముడుపులు రూపేణా చెల్లించాల్సిందేనని కొందరు సిబ్బంది తెగేసి చెబుతున్నారు. అడిగినంత ఇవ్వకపోతే పత్తిని దిగుమతి కాకుండా అడ్డుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. కొనుగోలు వ్యవహారంలో ఉన్నత స్థాయి వ్యక్తులు రంగ ప్రవేశం చేసినా సీసీఐ కేంద్రాల్లో ఎదురౌతున్న అనుభవం చూసి రైతులు ఖంగు తింటున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల్లో ఎక్కువ భాగం ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉన్నాయి. ఎన్టీఆర్ జిల్లా సీసీఐ కేంద్రాలు కూడా గుంటూరులోనే ఏర్పాటు చేశారు. ఎల్-1, ఎల్-2, ఎల్-3 వారీగా విభజించిన మీదట సుమారు 32 కేంద్రాల వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్నాయి. రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేసుకున్న పత్తిని అమ్మకం కోసం ఆయా కేంద్రాలకు తీసుకురావాల్సి వస్తుంది. రైతులు ఎంత మొత్తంలో అయితే కేంద్రానికి పత్తి తీసుకువస్తారో ఆ వివరాలు సీఎం యాప్‌లో కూడా నమోదు చేయాలి. అందుకోసం ప్రభుత్వం సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సిబ్బంది, బయ్యర్లు వేలిముద్రలు వేయాలి. ఒక వేళ వేలిముద్రలు వేయకపోతే సదరు వివరాలు సీఎం యాప్‌లో అప్‌లోడ్ అవ్వవు. వివరాలు అప్‌లోడ్ కాకపోతే పత్తి కొనుగోళ్లు జరగవు. ఈ పరిస్థితుల్లో కేంద్రాల్లో సిబ్బందికి ముందే రైతులు కప్పం కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని కేంద్రాల్లో క్వింటాల్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇవ్వకపోతే వేలి ముద్రలు వేయమని సిబ్బంది ముందే చెబుతున్నట్లు వాపోయారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సిబ్బందికి సీసీఐ బయ్యర్లు కూడా అనధికారికంగా 2 నుంచి 3 శాతం వరకు చెల్లించే పద్ధతి అమల్లో ఉన్నట్లు సమాచారం. అది చాలక రైతుల నుంచి అదనపు వసూళ్లకు పాల్పడటం వివాదాస్పదమవుతుంది. సీసీఐ కేంద్రాల ఏర్పాటు రైతులకు ఏమో కానీ కొందరికి మాత్రం మంచి లాభదాయకంగా ఉంది.

6

మెగా జాబ్‌మేళాలో మెరుగైన ఉద్యోగాలు

- రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది హాజరు



అక్రమ వ్యాపారాలను అరికట్టేదెలా?

- జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు
- ఎక్కువగా కారం మిల్లులకు అమ్మకాలు
- ఐదుశాతం జీఎస్టీని ఎగ్గొట్టేందుకే ఈ వ్యవహారం

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య

నరసరావుపేటలో డాక్టర్ ఇంట విషాదం

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలి

యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మహిళా సంఘాల నిధుల గోల్‌మాల్‌పై విచారణ



డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌కు సమస్యను వివరిస్తున్న బాధిత మహిళలు

అమరావతి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అత్తలూరు, ధరణికోట, వైకుంఠపురం, చావపాడు గ్రామాల్లో గ్రామ సమైఖ్య సంఘాల సభ్యుల రుణాల చెల్లింపులో జరిగిన సుమారు రూ. 1.5 కోట్ల గోల్‌మాల్‌కు సంబంధించి పత్రికలలో వచ్చిన కథనాలకు జిల్లా కలెక్టర్ స్పందించారు. డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఆయన ఆదివారం మండల సమాఖ్య కార్యాలయంలో విచారణ చేపట్టారు. రుణాలు చెల్లించినప్పటికీ అప్పులు ఉన్నట్లు చూపిస్తున్నాయని బాధిత మహిళలు వీవోలు చేసిన మోసాన్ని బాలునాయక్ దృష్టికి తీసుకువచ్చారు. స్త్రీనిధితోపాటు తాము తీసుకున్న పలు రుణాలు తిరిగి చెల్లించినప్పటికీ బ్యాంకులలో తమ పేరున అప్పులు అలానే ఉన్నాయని మండల సమాఖ్యకు బాధిత మహిళలు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల్లో మూడు కమిటీలను ఏర్పాటు చేసి సంఘాల వద్ద విచారణ జరిపిస్తామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, నగదు రికవరీ చేసి న్యాయం చేస్తామని బాలునాయక్ హామీ ఇచ్చారు. కొందరు మహిళలు తమ యానిమేటర్‌ను తొలగించాలని కోరడంతో గ్రామ సమాఖ్య సంఘాలు తీర్మానం చేసుకుని తొలగించుకోవచ్చని తెలిపారు. విచారణలో శ్రీనిధి ఏజీఎం ఆర్.చినబుల్లయ్య, హనుమాన్ నాయక్, ఏపీఎం కృష్ణప్రియ, మండల సమాఖ్య అధ్యక్షురాలు చింకా నాగలక్ష్మి, శివకుమారి, భాగ్యలక్ష్మి, బూక్యా బాలమ్మ, మరియమ్మ, సీసీలు పాల్గొన్నారు.

పోటాపోటీగా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

● కర్నూలు జట్టుపై ఉమ్మడి గుంటూరు జట్టు విజయం



విజయం సాధించిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు

కారంపూడి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్-14 విభాగపు బాలబాలికల ఖోఖో పోటీలు ఆదివారం పోటాపోటీగా సాగాయి. బాలుర విభాగంలో ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు, కర్నూలు జట్టుపై 10-7 తేడాతో విజయం సాధించింది. అలాగే చిత్తూరు జట్టు, ఈస్ట్ గోదావరి జట్టుపై 10-6, విశాఖ జట్టు విజయనగరం జట్టుపై 9-8, ప్రకాశం జట్టు కడప జట్టుపై 11-6 తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలికల విభాగంలో చిత్తూరు జట్టు ప్రకాశం జట్టుపై 10-6, విజయనగరం జట్టు కడప జట్టుపై 9-3, విశాఖపట్నం జట్టు అనంతపురం జట్టుపై 9-8 తేడాతో గెలుపొంది సెమీ ఫైనల్‌కు చేరుకున్నాయి. బాలుర సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు - గుంటూరు, విశాఖ - ప్రకాశం, బాలికల సెమీ ఫైనల్స్‌లో చిత్తూరు - విజయనగరం, శ్రీకాకుళం - విశాఖపట్నం జట్లు పోటీ పడనున్నాయి.

నేడు, రేపు రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

సత్తెనపల్లి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం వద్ద గల సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ నెల 25, 26 తేదీల్లో రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపల్ జాన్సన్ ఆదివారం తెలిపారు. ప్రదర్శనకు చైర్మన్‌గా సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ వ్యవహరిస్తున్నారన్నారు. ఎంపిక చేసిన 70 ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలోని అన్ని గురుకుల పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొంటున్నారని ప్రిన్సిపల్ తెలియజేశారు. ప్రారంభ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవి కుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతున్నట్టు జాన్సన్ తెలిపారు.

నేడు సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా సోమవారం గుంటూరు - విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ని రద్దు చేస్తున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా ఈ నెల 26వ తేదీన విశాఖపట్నం నుంచి గుంటూరు రావాల్సిన సింహాద్రి ఎక్స్‌ప్రెస్ కూడా రద్దు అవుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని డీఆర్ఎం విజ్ఞప్తి చేశారు.

అక్రమ వ్యాపారాలను అరికట్టేదెలా?

● జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు
● ఎక్కువగా కారం మిల్లులకు అమ్మకాలు
● ఐదుశాతం జీఎస్‌టీని ఎగ్గొట్టేందుకే ఈ వ్యవహారం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ)లో ఎగుమతి, దిగుమతి వ్యాపారస్తులు కలిసి చేసే జీరో బిజినెస్‌పైనే మిర్చి స్థానిక లావాదేవీలు జరుగుతాయి. యార్డు చుట్టుపక్కల ఉన్న కారం మిల్లులతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్నవాటికి జీరో బిజినెస్‌లోనే ఎండు మిరపకాయలను సరఫరా చేస్తుంటారు. ఇందుకు కారణం మిర్చిని సరఫరా చేసిన వెంటనే నగదు చేతికందుతుంది. కొనుగోలు చేసిన వ్యాపారి 5 శాతం జీఎస్‌టీని వాణిజ్య పన్నుల శాఖకు పంగనామం పెడతారు. మిర్చి పండని తూర్పు, పశ్చిమ గోదావరి లాంటి జిల్లాలకు కూడా జీరో బిజినెస్‌లోనే మిర్చి ఎగుమతి జరుగుతుంటుంది. ఉత్తరాదిన ఉన్న కొన్ని రాష్ట్రాలకు కూడా ఇదే విధానంలో మిర్చిని వ్యాపారస్తులు పంపిస్తారు. దీనివలన ఏటా రూ.కోట్లలోనే మార్కెట్ ఫీజు రూపంలో మిర్చియార్డుకు, జీఎస్‌టీ రూపంలో వాణిజ్య పన్నుల శాఖకు నష్టం వాటిల్లుతుంది. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూడా విచారణ జరిపి నిర్ధారించింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి మిర్చియార్డులో జీరో బిజినెస్‌ని పూర్తిగా నిలిపేయాలని పర్సన్ ఇన్‌చార్జ్ అమిలినేని భార్గవ తేజ ఆదేశాలు జారీ చేశారు. అవి ఏమేరకు అమలు జరుగుతాయన్నది చర్చనీయాంశంగా మారింది.

వ్యాపారస్తులు కూడబలుక్కుని..

రైతులు తీసుకొచ్చే మిర్చిని యార్డులో కమీషన్ వ్యాపారస్తుల ద్వారా కొనుగోలు చేసినందుకు ఒక శాతం మార్కెట్ ఫీజుని ఎగుమతిదారులు మార్కెట్ కమిటీకి చెల్లిస్తారు. కమీషన్ వ్యాపారస్తులు రైతు వద్ద 2 శాతం వసూలు చేసుకుంటారు. ఎగుమతిదారులు చెల్లించే 1 శాతం మార్కెట్ ఫీజుపైనే మార్కెట్ కమిటీ నిర్వహణ ఆధారపడి ఉంటుంది. అయితే దిగుమతి, ఎగుమతి వ్యాపారస్తులు కూడబలుక్కుని దీనిని మార్కెట్ కమిటీకి రాకుండా చేస్తున్నారు. నిత్యం కొన్ని వందల మిర్చి టిక్కీలు ఇలా జీరోలో బయటకు వెళ్లిపోతున్నాయి. ఈ విషయం యార్డు సూపర్‌వైజర్లకు తెలియకుండా జరిగే వ్యవహారం కాదు. ఇందులో సూపర్‌వైజర్ల పాత్ర కూడా ఉంటుందనేది బహిరంగ రహస్యమే.

ట్రేడింగ్ జరగలేదని చెప్పి..

యార్డు పరిసర ప్రాంతాల్లో పలు కారం తయారీ మిల్లులున్నాయి. వీటిల్లో ఉత్పత్తి అయిన కారం స్థానిక అవసరాలకే కాకుండా ఇతర ప్రాంతాలకు ఎక్స్‌పోర్టు అవుతుంది. దీంతో కారం మిల్లుల యజమానులు ఎగుమతిదారుల ద్వారా మిర్చిని కొనుగోలు చేస్తారు. ఇక్కడే జీరో వ్యాపారానికి తెర తీస్తారు. మిర్చియార్డులో ట్రేడింగ్ జరగలేదని చెప్పి కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేయడానికి తీసుకెళ్తున్నామని చెప్పి యార్డు గేటు దాటిస్తారు. అయితే అప్పటికే ఆ మిర్చిని ఎగుమతిదారుడు కొనుగోలు చేసి ఉంటాడు. ఇలా గేటు దాటిన మిర్చిని నేరుగా కారం మిల్లులకు చేర్చి అక్కడ కారం తయారీకి వినియోగిస్తారు. దీనివలన మిర్చియార్డుకు ఎలాంటి ఆదాయం రాకుండా పోతుంది. అలానే గుంటూరు మార్కెట్ కమిటీ పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన మిర్చిని విక్రయించాలన్నా యార్డుకు ఫీజు చెల్లించాలి. కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వలపై సరైన అజమాయిషీ, లెక్కలు లేని కారణంగా ఇక్కడ సులభతరంగా జీరో బిజినెస్ జరుగుతుంది.

కటింగ్ బిజినెస్‌ని గుర్తించాలంటే..

రేట్ కటింగ్ బిజినెస్ మిర్చియార్డులో విచ్చలవిడిగా జరుగుతుంటుంది. ఎగుమతిదారుడు క్వింటాల్ రూ. 16 వేలకు కొనుగోలు చేసి లెక్కల్లో మాత్రం క్వాలిటీ బాగాలేదనో, వేరే రకం మిరపకాయలనో నమోదు చేసి ధరని రూ. 12 వేలకు తగ్గిస్తారు. దీనివలన కూడా మార్కెట్ ఫీజు, జీఎస్‌టీ రూపంలో కోత పడుతున్నది. ఈ అక్రమ వ్యాపారాన్ని గుర్తించాలంటే చాలా కష్టం. ఈ అక్రమ వ్యాపారాలను అరికట్టాలన్న జేసీ భార్గవతేజ ఆదేశాలు ఏమేరకు అమలు జరుగుతాయో వేచి చూడాల్సిందే.

మెగా జాబ్ మేళాలో మెరుగైన ఉద్యోగాలు

● రాష్ట్ర వ్యాప్తంగా 11,500 మంది హాజరు
● 60 కంపెనీలు.. 3,604 మందికి ఉద్యోగాలు
● మంత్రి లోకేశ్‌కు ధన్యవాదాలు తెలిపిన యువత



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో అధికారులు, నేతలు

మంగళగిరి సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ ఆదేశాలతో ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన మెగా జాబ్ మేళా నిరుద్యోగులకు వరంలా మారింది. జాబ్‌మేళాకు రాష్ట్ర నలుమూలల నుంచి 11,500 మందికిపైగా హాజరు కాగా ప్రతిభ, అవగాహనా సామర్థ్యం ఆధారంగా 3,604 మందికి ఉద్యోగాలు లభించాయి. ఐటీ, డేటా ఎంట్రీ, బీపీవో, రిటైల్, ఈకామర్స్, టూరిజం, హాస్పిటాలిటీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఆటోమోటివ్, వైద్యం, ఫార్మసీ, ఎలక్ట్రికల్, బ్యాంకింగ్, పేటీఎం, ఎయిర్‌టెల్, రిలయన్స్, హీరో మోటార్స్, మాస్టర్ మైండ్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఇన్సూరెన్స్, మెడ్‌ప్లస్ తదితర రంగాల్లో ఉద్యోగాలను భర్తీ చేసేందుకు మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జాబ్ మేళా జరిగింది. మంగళగిరి నియోజకవర్గ యువత కోసమే జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రకటించినప్పటికీ రాష్ట్ర నలుమూలల నుంచి యువత పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఏడు నుంచి పదో తరగతి చదివిన వారు, ఇంటర్, డిప్లొమా, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎంపీహెచ్‌డబ్ల్యూ నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, బీఈ, బీటెక్, ఎంటెక్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ, పీజీ విద్యార్హత కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు హాజరయ్యారు. 60కి పైగా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూల ఆధారంగా రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు జీతం కలిగిన ఉద్యోగాలకు 3,604 మందిని ఎంపిక చేయగా, కూటమి నేతల చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అభ్యర్థులకు నియామక పత్రాలు అందించిన అనంతరం కూటమి నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా మంగళగిరిలో మెగా జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చొరవతో అనేక ప్రముఖ కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

సూర్యలంక తీరం.. జనసంద్రం

● పోటెత్తిన లక్షమందికిపైగా పర్యటకులు



బాపట్ల సూర్యలంక తీరంలో భారీగా పర్యాటకులు

బాపట్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) బాపట్ల మండలం సూర్యలంక తీరంకు ఆదివారం పర్యాటకులు అధిక సంఖ్యలో రావటం కార్తీక పౌర్ణమి రోజును తలపించింది. సుమారు లక్షమందికి పైగా పర్యాటకులు తీరంకు వచ్చి ఉంటారని అధికారులు అంచనా వేశారు. సెలవు రోజు కావడం పైగా కార్తీకమాసం చివరి ఆదివారం కావటంతో దూరప్రాంతాల నుంచి పర్యాటకులు, భక్తులు తీరానికి పోటెత్తారు. దూరప్రాంతాల నుంచి వాహనాల ద్వారా తెల్లవారుజామునే తీరానికి చేరుకుని పుణ్యస్నానాలను ఆచరించారు. తీరంలో యువకులు కేరింతలు కొడుతూ సరదాగా గడిపారు. చిన్నారులు ఇసుక తిమ్మెలతో ఆడుకుంటూ ఆనందంగా గడిపారు. మహిళలు, మాలాధరణ భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాలను ప్రతిష్ఠించి కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ సామాజిక వర్గాల వారు తీరం సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద కార్తీక వనభోజనాలను నిర్వహించుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు ఆదర్శనగర్ సమీపంలోని జీడిమామిడి తోటల వద్ద కుటుంబ సమేతంగా వనభోజనాలను చేస్తూ సంతోషంగా గడిపారు. తీరం సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం, శ్రీతారకేశ్వర స్వామి దేవాలయం భక్తులతో కిక్కిరిసింది. సూర్యలంక తీరంకు వాహనాలు అధిక సంఖ్యలో రావటంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడటంతో బాపట్ల రూరల్ సీఐ గంగాధరరావు తన సిబ్బందితో పర్యవేక్షించారు.

ఆశ్రం కళాశాలలో పీజీ వైద్య విద్యార్థి ఆత్మహత్య



మృతుడు డాక్టర్ వరగాని జవహర్

ఏలూరు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సమీపంలోని ఆశ్రం మెడికల్ కాలేజీలో పోస్టుగ్రాడ్యుయేషన్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం పల్నాడు జిల్లా నర్సరావుపేటకు చెందిన వరగాని జవహర్ (30) ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీలో పీజీ చేస్తున్నారు. విధుల్లో భాగంగా ఆదివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 9 గంటల వరకూ ఆసుపత్రి అత్యవసర విభాగంలో డ్యూటీ చేయడానికి వచ్చారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో ఆయన వాష్‌రూమ్‌లోకి వెళ్లి తలుపు గడియపెట్టుకుని ఎంత సేపటికీ రాలేదు. ఉదయం 8.15 గంటలకు మిగిలిన డాక్టర్లు వెళ్లి చూడగా తలుపు వేసి ఉంది. దీంతో ఆసుపత్రి సీఈవో డాక్టర్ హనుమంతరావు ఇతర అధికారులకు తెలియజేసి వెంటనే తలుపులను పగులగొట్టి చూశారు. డాక్టర్ జవహర్ మరణించి ఉన్నారు. అక్కడ మత్తు ఇంజక్షన్లు, సిరంజ్‌లు లభించాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. జవహర్ తండ్రి డాక్టర్ విజయ్‌సాగర్ నర్సరావుపేటలో పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. జవహర్ తన తల్లిదండ్రులకు ఒకే ఒక్క సంతానం. జవహర్ మత్తు వైద్యుడిగా చదువుతూ మత్తు ఇంజక్షన్లు చేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో మెడికల్ కాలేజీలో తీవ్ర విషాదం నెలకొంది. ఆత్మహత్యకు కారణం తెలియరాలేదు. ఏలూరు రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం జరిపి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

రేపటి వాక్ ఇన్ అడ్మిషన్స్ రద్దు

గుంటూరు సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ కోర్సుకు ఈ నెల 26న జరగాల్సిన వాక్ ఇన్ అడ్మిషన్స్ ప్రక్రియను రద్దు చేసినట్లు రిజిస్ట్రార్ జి.రామచంద్రరావు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఆరోజున వాక్ ఇన్ అడ్మిషన్స్‌కు హాజరు కావాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

గత ప్రభుత్వంలో మైనార్టీలపై వివక్ష

● ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్



సమావేశంలో మాట్లాడుతున్న ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్

పిడుగురాళ్ళ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీలు ఎంతో వివక్షతకు గురయ్యారని, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ అన్నారు. ఆదివారం పిడుగురాళ్ల ఆర్‌అండ్‌బీ బంగ్లాలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మైనార్టీలకు రావాల్సిన పథకాలు గత ఐదేళ్లుగా ఎన్నో నిలిపివేశారని, 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముస్లింలకు ఒక స్వర్ణయుగంలా ఉందన్నారు. ఆడపిల్లల వివాహానికి దుల్హన్ పథకం కింద రూ. 50 వేలు, దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా ఇమామ్, మౌజన్‌లకు జీతాలు, షాదీఖానా, ఈద్గాలు, మదర్సా నిర్మాణాలు ఎన్నో జరిగాయన్నారు. మాయమాటలతో గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి ఎంతో ద్రోహం చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనపై నమ్మకం ఉంచి మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు షేక్ బాబావలి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌అలీ, అబ్దుల్లా, ముజీబ్, కార్ సైదా, టీడీపీ మస్తాన్‌వలి, ఫరీద్ మేస్త్రి, ఖాదర్‌వలి తదితరులు పాల్గొన్నారు. గుంటూరు నుంచి దాచేపల్లి వస్తుండగా మార్గమధ్యంలోని సత్తెనపల్లిలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహమ్మద్‌ను సత్తెనపల్లి టీడీపీ ముస్లిం నేతలు ఘనంగా సన్మానించారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం ఆదివారం నాటికి 585.90 అడుగులు ఉంది. ఇది 300.03 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,120 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 3431 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 15,651 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 15,651 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

ఐఎంఏ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా డాక్టర్ నరేంద్రరెడ్డి

● గుంటూరు శాఖకు మూడు పతకాలు



పతకాలతో డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ కార్యదర్శిగా జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అవార్డు అందుకున్నారు. 2023-24 సంవత్సరానికి గుంటూరు శాఖను అన్ని విభాగాల్లో ఉత్తమ పనితీరు కనబరిచేలా తీర్చిదిద్దినందుకుగానూ డాక్టర్ నరేంద్రరెడ్డికి ఈ అవార్డు దక్కింది. గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో జరుగుతున్న ఐఎంఏ రాష్ట్ర శాఖ 66వ వార్షిక సదస్సులో ఐఎంఏ రాష్ట్రస్థాయి అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌వీ అశోకన్, కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నూతన అధ్యక్షుడు డాక్టర్ జి.నందకిషోర్ చేతులు మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఉత్తమ కార్యదర్శితోపాటు గుంటూరు శాఖకు ఉత్తమ సేవా విభాగం, విపత్కర పరిస్థితుల్లో ఉన్న వారికి ఆపన్నహస్తం (ఫ్లడ్ రిలీఫ్) అందించినందుకుగానూ మరో రెండు పతకాలు లభించాయి. ఈ సందర్భంగా ఐఎంఏ నేతలు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టి గుంటూరు బ్రాంచ్‌కి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని ప్రశంసించారు. గుంటూరు ఐఎంఏ బ్రాంచ్ చరిత్రలో నిలిచిపోయేలా డాక్టర్స్ దివాళీ సెలబ్రేషన్స్, ఇఫ్తార్ విందు, ఆర్‌జీ కర్ కాలేజి ఘటన నిరసన కార్యక్రమాలను తనదైన శైలిలో నిర్వహించారని తెలిపారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత



స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో కొమ్మాలపాటి

పెదకూరపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యలో ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులకు తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఆదివారం స్కాలర్‌షిప్పులు అందజేశారు. అమెరికాలో స్థిరపడిన రాయపూడి రామకృష్ణ విద్యార్థులకు లక్షా 15 వేల రూపాయల స్కాలర్‌షిప్ ప్రకటించి, కొమ్మాలపాటి శ్రీధర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ అసమాన ప్రతిభతో రాణించి, అమెరికాలో స్థిరపడిన యువకులు అనేకమంది గత ఎన్నికల్లో టీడీపీ కోసం ఇండియా వచ్చి పని చేశారని, ఆ తరువాత కూడా ఈ రూపంలో సహాయం చేయడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో వెన్నా సాంబశివారెడ్డి, వరప్రసాద్, రాయపూడి శంకర్రావు, నరసింహారావు, రవి, సోమయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పోరాడాలి



వేడుకల్లో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రమణ్యం

గుంటూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉపాధ్యాయులు పోరాడాలని, ప్రభుత్వ విద్య ద్వారానే సామాజిక న్యాయం దక్కుతుందని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ జిల్లా స్వర్ణోత్సవ మహాసభలను ఆదివారం గుంటూరు ఎన్‌జీవో హోంలో నిర్వహించారు. తొలుత వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి ఎన్‌జీవో హోం వరకూ ఉపాధ్యాయుల ర్యాలీ నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను, ఎస్‌టీఎఫ్ఐ జెండాను, యూటీఎఫ్ జెండాను యూటీఎఫ్ పూర్వ నాయకులు కేఎస్‌వీ దుర్గారావు, జి.ప్రభుదాసు, ఎస్.తాండవ కృష్ణ తదితరులు ఆవిష్కరించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో గత 30 ఏళ్లలో విద్యా కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణ పెరిగిందన్నారు. విద్యా ప్రైవేటీకరణను మరింత ప్రోత్సహించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యావిధానం తీసుకువస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో నం.117 నూతన విద్యావిధానంలో భాగమేనని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆ జీవోను రద్దు చేస్తామని ఇంతవరకూ చేయలేదన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఉపాధ్యాయులు అందరిని ఒకే గొడుగు కిందకు తెచ్చిన ఘనత యూటీఎఫ్‌కు దక్కుతుందన్నారు. యూటీఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కె.జోజయ్య మాట్లాడుతూ 50 ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఏకైక పెద్ద సంఘంగా, ఎన్నో విజయాలు సాధించిన సంఘంగా యూటీఎఫ్ నిలిచిందన్నారు. జిల్లా అధ్యక్షురాలు బి. ఆదిలక్ష్మి, రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏ.ఎన్.కుసుమ కుమారి, సీనియర్ నాయకులు ఎస్.తాండవకృష్ణ, కేఎస్‌వీ దుర్గారావు, జి.ప్రభుదాసు, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యం.కళాధర్ ప్రసంగించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఎం కప్ విజేతలు వీరే

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): డీఆర్ఎం కప్-2024 సెకండ్ ఎడిషన్ బ్యాడ్మింటన్, వాలీబాల్ పోటీలు ముగిశాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో బ్యాడ్మింటన్ డబుల్స్‌లో పురుషుల విభాగం నుంచి షేక్ అబ్బాస్, ప్రణయ్ గెలుపొందగా జి.రాజ్‌పాల్, షేక్ రియాజ్ రన్నరప్‌గా నిలిచారు. షేక్ ఏటీ రెహ్మాన్, ఎస్.రమేష్ మూడో స్థానాన్ని పొందారు. మహిళల విభాగంలో కలెక్టర్ ఆఫీసుకు చెందిన దివ్య, సంధ్య గెలుపొందగా, రైల్వేస్ నుంచి పాల్గొన్న పి.లావణ్య, ప్రాంజలి రన్నరప్‌గా నిలిచారు. గుంటూరు రైల్వేస్‌కు చెందిన ధనలక్ష్మి, నాగజ్యోతి మూడో స్థానంలో నిలిచారు. బాస్కెట్ బాల్ పోటీల్లో డీఆర్ఎం గుంటూరు జట్టు గెలుపొందగా రెండో స్థానంలో నిక్కీ బాలర్స్ మూడో స్థానంలో అంకిరెడ్డిపాలెం జట్లు నిలిచాయి. వాలీబాల్‌లో వికాస్ టీం గెలుపొందగా రెండో స్థానంలో డీఆర్ఎం, మూడో స్థానంలో కాజా టీంలు నిలిచాయి.

అగ్ని ప్రమాదంలో సిలిండర్ పేలి..

ఒకరు మృతి.. ముగ్గురికి గాయాలు



మృతుడు తులసీనాథ్ (ఫైల్)

పెదకాకాని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వెంకటకృష్ణాపురంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరి ఇల్లు దగ్ధం కాగా, ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటకృష్ణాపురం గ్రామానికి చెందిన అమ్మిశెట్టి శ్రీనివాసరావు, అతని కుమార్తె సుజాత పూరి ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఆదివారం ఇంట్లో దీపారాధన చేసి గ్రామానికి సమీపంలో ఉన్న నాగేంద్ర స్వామి పుట్ట వద్దకు వెళ్లారు. దీపారాధన నుంచి పెద్దమంట వచ్చి ఇంటికి అంటుకున్నాయి. ఈ ఘటనలో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో మూడు గ్యాస్ సిలిండర్లు ఉండగా అందులో రెండు వెంటనే పేలిపోయాయి. మూడో సిలిండర్ విషయం తెలియక గ్రామానికి చెందిన అమ్మిశెట్టి తులసీనాథ్(37), అమ్మిశెట్టి పరమేష్, అమ్మిశెట్టి వీరాంజనేయులు, అమ్మిశెట్టి మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి వెళ్లారు. వీళ్లంతా ప్రమాదం జరిగిన తీరును పరిశీలిస్తుండగా మూడో సిలిండర్ పేలింది. ఈ ఘటనలో పైనలుగురికి గాయాలయ్యాయి. అమ్మిశెట్టి తులసీనాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించగా చికిత్స పొందుతూ తులసీనాథ్ మృతి చెందాడు. పెదకాకాని సీఐ నారాయణస్వామి, అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వేమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదివారం ఉదయం జంపని శివాలయం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వేమూరు ఎస్ఐ రవికృష్ణ తెలిపిన వివరాల మేరకు.. వేమూరు గ్రామానికి చెందిన చల్లంచర్ల సుబ్రహ్మణ్యం తెనాలి వెళ్తుండగా, జంపని శివాలయం సమీపంలో తెనాలి నుంచి కొల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ప్రమాదంలో సుబ్రహ్మణ్యంకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. సుబ్రహ్మణ్యం సోదరుడు సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవికృష్ణ తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.95 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

7 నుంచి ఏపీ మూడో ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా క్యారమ్ సంఘం, ఆంధ్రరాష్ట్ర క్యారమ్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరు రెవెన్యూ భవన్లో డిసెంబరు 7, 8 తేదీల్లో ఆంధ్రరాష్ట్ర మూడో ర్యాంకింగ్ క్యారమ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆంధ్రరాష్ట్ర క్యారమ్ సంఘం ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషు లు, మహిళలు, వెటరన్ మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు జరుగుతాయని అన్నారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారు వచ్చే ఏడా ది జనవరిలో జరిగే ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్‌లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 9951115678ను సంప్రదించాలన్నారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక

గుంటూరు(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ



యు.రాజశేఖర్, ఎం కళాధర్

ఎన్నిక ఆదివారం ఎన్జీవో కల్యాణమండపంలో జిల్లా స్వర్ణోత్సవాల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యు.రాజశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం కళాధర్, గౌరవాధ్యక్షుడిగా పీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా జీ వెంకటేశ్వర్లు సహాధ్యక్షురాలిగా జీవీ నాగమణి, కోశాధికారి ఎండీ గయాసుద్దౌలా, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కే సాంబ శివరావు, జీ వెంకటేశ్వరరావు, టీ ఆంజనేయులు, ఎం గోవిందు, కే కేదార్‌నాథ్, ఎండీ షకీలా బేగం, కే కామాక్షి, కే రంగారావు, బీ ప్రసాదు తదితరులు ఎన్నికయ్యారు.

ముగిసిన మాస్టర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపికలు

గుంటూరు(తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన మాస్టర్ జిల్లాస్థాయి అథ్లెటిక్ మీట్ పోటీలు, ఎంపికలు ముగిశాయి. 30+,35+,40+ నుంచి 80 సంవత్సరాల మహిళలు, పురుషుల విభాగాల్లో వాకింగ్, రన్నింగ్, హైజంప్, లాంగ్ జంప్, త్రోబాల్ అంశాల్లో పోటీలు జరిగాయి. పోటీల్లో దాదాపు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ లాల్‌వజీర్ మాట్లాడుతూ పోటీల్లో 120 మంది క్రీడాకారులు జిల్లా నుంచి రాష్ట్ర మీట్‌కు అర్హత సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయి మీట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారు కేరళలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కోటేశ్వరరావు, లక్ష్మీ, నవమి, విజయ్, మూర్తి, వెంకటేష్, రామకృష్ణ, జీవీఎస్ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌గా కుమారి నంద



బంగారు పతకంతో కుమారి నంద

గుంటూరు(తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో ఈ నెల 22 నుంచి జరిగిన సౌత్ ఇండియా సీనియర్, సబ్ జూనియర్ అండ్ జూనియర్ ఎక్యూపుడ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో గుంటూరు బార్ అసోసియేషన్‌కి చెందిన మహిళా న్యాయవాది పర్చూరు కుమారి నంద బంగారు పతకం సాధించారు. కుమారి నంద సీనియర్స్ మహిళల విభాగంలో 76 కేజీల విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున పోటీ పడి 297.5 కేజీల బరువును ఎత్తి సౌత్ ఇండియా చాంపియన్‌గా నిలిచారు. ఈ సం దర్భంగా బంగారు పతకం సాధించిన కుమారి నందను ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐలు) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీనియర్ న్యాయవాది జె నరసింహారావు, సభ్యులు చెరుకూరి సత్యనారాయణ, దాసరి ఉమామహేశ్వరరావు, శిద్దా సత్యనారాయణ, గుంజి రమేష్, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

కోలాహలంగా కార్తీక వనసమారాధన

గుంటూరు(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలానగర్‌లో కాలనీ వాసులు ఆదివారం కోలాహలంగా కార్తీక వనసమారాధన నిర్వహించారు. శ్యామలానగర్ పార్క్‌లో వంద కుటుంబాలు కులమతాలకు అతీతంగా శ్రీకృష్ణుడి విగ్రహానికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి దీపారాధనలు చేశారు అనంతరం మహిళలు సంగీత విభావరి, కోలాటం చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు వేడుకల్లో భాగంగా వనభోజనాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వరు కాలనీ పెద్దలు సామినేని కోటేశ్వరరావు, కనపర్తి రాఘవరావు, రెడ్డి నారాయణమూర్తి, వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, పోతురాజు, పెద్ద సంఖ్యలో కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

అరండల్‌పేట ఇన్‌చార్జి సీఐగా వీరాస్వామి

గుంటూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి) : అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌చార్జ్ సీఐగా నియమితులైన వీరాస్వామి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అరండల్‌పేట పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు రాచమర్యాదలు చేశారనే అభియోగాలపై సీఐ కొంకా శ్రీనివాసరావును వీఆర్‌కు పంపిన విషయం విదితమే. అప్పటి నుంచి అరండల్‌పేట పోలీస్ స్టేషన్ లో సీఐ కుర్చీ ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో సీసీఎస్‌లో ఉన్న సీఐ వీరాస్వామిని అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌కు ఇన్‌చార్జి సీఐ గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిసి స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలపై చర్చించారు.

పోలింగ్ కేంద్రాల్లో సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబర్ 24(ఆంధ్రజ్యోతి): ప్రతి పోలింగ్ కేంద్రంలో పీఎస్ నంబర్, బీఎల్‌వో పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్, తూర్పు ఈఆర్‌వో పులి శ్రీనివాసులు ఆదేశించారు. ఆదివారం స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఉర్దూ స్కూల్లోని 124, 125, 126, 132 నుంచి 136 వరకు, 139 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్, తూర్పు ఈఆర్‌వో మాట్లా డుతూ పోలింగ్ కేంద్రాల్లో పీఎస్ నెంబర్, బీఎల్‌వో పేరుతో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో అందిన ఫారాలు పక్కాగా ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఆర్‌వో డీ శ్రీనివాసరావు, సూపర్‌వైజర్, అధికారులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

జీఎంసీ కాల్ సెంటర్ ద్వారా విస్తృత సేవలు

ప్రజల సమస్యల సత్వర పరిష్కారం కోసం జీఎంసీ కాల్ సెంటర్ విస్తృత సేవలను అందిస్తోందని కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజల కోసం నగర పాలక సంస్థ అందిస్తున్న సేవలపై ఈ నెల 25 నుంచి (ఆస్తి పన్ను మార్పు, ఆస్తి పన్ను విధింపు, నీటి కుళాయిల కనెక్షన్లు, కుళాయిల రిపేర్లు, డ్రైన్ కనెక్షన్లు, రిపేర్లు, వ్యాపార లైసెన్సులు, జనన మరణ ధ్రువ పత్రాల మార్గదర్శకాలు, వివాహ పత్రాల నమోదు) సేవలపై ఎటువంటి సందేహాలు ఉన్నా 0863-2345103, 104, 105 నెంబర్లకు సంప్రదించి సమాచారాన్ని పొందవచ్చునన్నారు. జీఎంసీ కాల్ సెంటర్ ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు, సెలవు దినాల్లో కూడా సేవలందిస్తుందన్నారు.

అన్ని దానాల్లో అన్నదానం గొప్పది : డేగల ప్రభాకర్



డేగల ప్రభాకర్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నదానం అన్ని దానాల్లో కల్లా అత్యంత గొప్పదని ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ అన్నారు. లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరు ప్రభుత్వాస్పత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నపూర్ణ ఆహార పథకం కార్యక్రమాన్ని ప్రభాకర్ ప్రారంభించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్నదానం చేయడం దైవకార్యంతో సమానమని ప్రభాకర్ పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సేవా కార్యక్రమాలను చేయాలని ఆయన పిలుపునిచ్చారు. లైఫ్ టైం వాకర్స్ అసోసియేషన్ వారు వివిధ రకాల సేవా కార్యక్రమాలు విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేదలకు నిత్య అన్నదాన కార్యక్రమాలు, మొదలగు సేవా కార్యక్రమాలతో నిత్యం ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లైఫ్‌టైమ్ వాకర్స్ అసోసి యేషన్ వ్యవస్థాపకుడు సాతులూరు ప్రకాశరావు, అన్నపూర్ణ పథకం చైర్మన్ వెంకట నారా యణ, బచ్చు గణేష్, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకట శ్రీనివాసరావు, గౌరవ చైర్మన్ మట్టు పలి శ్రీనివాస్ శరణ్, నేరెళ్ల శ్రీనివాసరావు, మేకల బాబురావు, నిశ్శంకరరావు అప్పారావు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్

గుంటూరు(తూర్పు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ కోరారు. ఆదివా రం స్థానిక కొత్తపేట, మల్లయ్య లింగం భవన్‌లో ది గుంటూరు నగర ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జీజీహెచ్ ఆటో స్టాండ్ సభ్యుల సమావేశం జరిగింది. సమావే శానికి యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ జీవో నెంబర్ 21, 31లను రద్దు చేయాలన్నారు. కూట మి ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఇస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్ర మంలో కోట మాల్యాద్రి, కురాకుల రాంప్రసాదు, బాబర్. శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన తప్పదు

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవలింగారావు

గుంటూరు(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో దీర్ఘకాలంగా పేరుకు పోయిన సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కే బసవలింగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ అధ్యక్షతన నిర్వహిం చిన జిల్లా కమిటీ సభ్యుల సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బసవలింగారావు మాట్లాడుతూ పాఠశాల విద్యలో పెండింగ్ సమస్యలు పరిష్కరించకపోగా పాఠశాల నిర్వహణా పనిగంటలు అశాస్త్రీయంగా పెంచి కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని, వెంటనే పెంచిన పనిగంటలు ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం మొం డిగా వ్యవహరిస్తే ఆందోళనకు సిద్ధపడతామని హెచ్చరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్ మాట్లాడుతూ 6నెలలుగా విడుదల చేయని పీఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కమిటీ సమావేశంలో జిల్లాశాఖ ఉపాధ్యక్షుడు పుట్టా జనార్దనరావు, పి.లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శులు కేసన రమేష్, గుడిపాటి దాస్, రాష్ట్ర కౌన్సిలర్ చెట్టిపోగు లక్ష్మణ కుమార్, జిల్లా నాయకులు టి.శరత్‌బాబు, షరీఫ్, కిరణ్, శ్రీనివాసరావు, శివన్నారాయణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మారథాన్ పోటీల్లో జిల్లా పోలీసుల ప్రతిభ



విజేతలను అభినందిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ నగరంలోని జింఖానా మైదానంలో ఈనెల 17న నిర్వహించిన మారథాన్ 21 కిలోమీటర్ల పరుగు పందెంలో గుంటూరు జిల్లా పోలీస్ విభాగంలో నల్లపాడు పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ రాజశేఖర్ బాబు, హోంగార్డు యూనిట్‌లో పనిచేస్తున్న హోంగార్డు కృష్ణ కిషోర్ పరుగు పందెం పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచారు. ఏఎస్సై రాజశేఖర్‌బాబు 60 సంవత్సరాల వయసు విభాగంలో ప్రథమ స్థానంలో, జనరల్ విభాగంలో హోంగార్డు కృష్ణ కిషోర్ 8వ స్థానంలో విజేతలుగా నిలిచారు. నిర్వాహకులు విజేతలకు జ్ఞాపిక, సర్టిఫికెట్‌లను బహూకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మారథాన్ పరుగు పందెంలో మెడల్, సర్టిఫికెట్ సాధించిన ఏఎస్ఐ, హోంగార్డులను అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

గుంటూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ సుమారు 60 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతి చెందాడు. రైల్వే స్టేషన్ రెండవ గేట్ దగ్గర అపస్మారక స్థితిలో పడి ఉండగా ఆదివారం స్థానికుల సమాచారంతో చుట్టుపక్కల వారు జీజీహెచ్‌లో చేర్పించగా అతను చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతని పేరు, అడ్రస్ తెలియరాలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి శవగారంలో భద్రపరిచారు. మృతదేహాన్ని గుర్తించిన వారు కొత్తపేట పోలీస్‌స్టేషన్ సీఐని 8688831320 నెంబరులో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ముగిసిన విదుశేఖర భారతీ మహాస్వామి విజయయాత్ర

గుంటూరు(తూర్పు), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం 37వ జగద్గురువులు విదుశేఖర భారతీ మహాస్వామి విజయ యాత్ర మహోత్సవం నగరంలో ఆదివారంతో ముగిసింది. నాలుగు రోజులు పాటు సాగిన ఈ పర్యటన దేవాలయాల సందర్శన, ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి, జగద్గురు అమృత



చండీయాగ పూర్ణాహుతి చేస్తున్న విదుశేఖర భారతీ మహాస్వామి

హస్తములతో శారద చంద్రమౌళీశ్వర పూజ కార్యక్రమాలతో వైభవంగా సాగింది. మూడు రోజులపాటు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామికి పాదుకా పూజలు, భిక్షా వందనం వస్త్ర కానుక పుష్ప సమర్పణ చేశారు. గుంటూరు మండల వేద ప్రవర్తక విద్వత్పరీక్ష సభ, శతమానం ఉత్సవ వేద సభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నాలుగో రోజు పర్యటనలో భాగంగా స్వామి వారు నగరంలోని పండరీపురం యజ్ఞవల్క్య క్షేత్రం, అరండల్‌పేటలోని శృంగేరి పీఠ పాలిత సీతారామస్వామి వారి దేవస్థానం, శ్రీ రాజరాజేశ్వరి ఆస్పత్రులను సందర్శించారు. అనంతరం సంపత్‌నగర్‌లోని శృంగేరి శంకరమఠం శారదా పరమేశ్వరి దేవస్థానంలో నవ చండీయాగ పూర్ణాహుతి నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం గుంటూరు నుంచి రాజోలు సమీపంలో గుడిమెళ్ళ లంక గ్రామానికి స్వామి పయనమయ్యారు.

కరాటేతో స్వీయ రక్షణ : ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

గుంటూరు(తూర్పు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యక్తుల స్వీయ రక్షణకు కరాటే దోహద పడుతుందని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో అమరావతి ఓపెన్ 2024 కరాటే పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. వైసీపీ హయాంలో క్రీడా రంగం నిర్లక్ష్యానికి గురైందని విమర్శించారు. క్రీడాకారులకు రిజర్వేషన్‌లు కల్పించడం, క్రీడా సౌకర్యాలు మెరుగుపరచడానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందన్నారు. కరాటేలో మరిన్ని పతకాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం బీఆర్ స్టేడియాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మీరావలి, జాగర్లమూడి శ్రీనివాస్, గాలి సతీష్, కూట పిచ్చిరెడ్డి, రియాజ్, కందుకూరి వెంకట్, కోచ్‌లు మాలిక్, రవికుమార్, రాంబాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రబంధమణి భూషణం' గ్రంథావిష్కరణ

గుంటూరు(తూర్పు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ స్వామి కళావేదికపై అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్, సంస్కృతి సంగీత సాహిత్య నృత్య నాటక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ పండితులు కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కందుకూరి సత్యసూర్యనారాయణమూర్తి



గ్రంథావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న గరిమెళ్ళ అచ్యుత సత్య శేషగిరి సోమయాజుల శర్మ, అప్పాజోస్యుల సత్యనారాయణ తదితరులు

రాసిన ప్రతిపదార్థ, తాత్పర్య సహిత వ్యాఖ్యానం 'ప్రబంధమణి భూషణం' గ్రంథావిష్కరణ సభ జరిగింది. తొలుత సంస్కృతి నిర్వాహకుడు సర్రాజు బాలచందర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్తలు గరిమెళ్ళ అచ్యుత సత్య శేషగిరి సోమయాజుల శర్మ గ్రంథాన్ని ఆవిష్కరించారు. సభలో సాహితీ వేత్తలు డాక్టర్ సూర్య దేవర రవికుమార్, దేశం పాపిరెడ్డి, అజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, రంగస్థల, సినీ నటుడు, రచయిత, దర్శకుడు వైఎస్ కృష్ణేశ్వరరావు తదితరులు పాల్గొని గ్రంథ వ్యాఖ్యాతలు కందుకూరి రామకృష్ణ సూర్యనారాయణ, కందుకూరి సత్య సూర్యనారాయణమూర్తిలను ఘనంగా సత్కరించారు.

గోరా స్ఫూర్తి ప్రదాత : డాక్టర్ సమరం

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మతం మనిషిని బానిసగా మారుస్తుందని, స్వేచ్ఛగా శాస్త్రీయంగా ఆలోచింపనివ్వదని, మత రహిత సమాజమే సమాజ పురోగతికి తోడ్పడుతుందని, కోట్లాది ప్రజలకు వివరించి ఆచరించిన మహనీయుడు గోపరాజు రామచంద్రరావు(గోరా) అని ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం కొనియాడారు. ఆదివారం గుంటూరులోని జన చైతన్యవేదిక హాల్లో గోరా జీవిత ప్రస్థానంపై జరిగిన సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమరం మాట్లాడుతూ సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన గోరా సమాజ మార్పునకు నాస్తికత్వం, గాంధీజీ బోధనలు దోహద పడతాయని నమ్మి జీవితాంతం ఆచరించారన్నారు. అంటరాని తనం, సామాజిక అసమానతలు, మూఢ నమ్మకాలపై నిరంతరం ప్రజలను జాగృతులను చేశారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, మానవత చైర్మన్ పావులూరి రమేష్, నేస్తం సహ వ్యవ స్థాపకులు టి.ధనుంజయ రెడ్డి,



ప్రసంగిస్తున్న డాక్టర్ సమరం, వేదికపై డొక్కా, లక్ష్మణరెడ్డి తదితరులు

గాంధీయవాది, యోగా శిక్షకులు ఇందుశేఖర్, హేతువాది చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు.

కళాకారులను ప్రోత్సహించాలి

గుంటూరు(తూర్పు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): కళాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ సమరం అన్నారు. స్థానిక బ్రాడీపేట సీపీఎం కార్యా లయంలో ఆదివారం డాక్టర్ పట్టాభి కళాపీఠం ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్ర మం జరిగింది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కళలు దేశ ఔన్నత్యాన్ని, సంస్కృతిని అద్దం పడతాయన్నారు. మరో అతిథి సీవీ రాజు మాట్లాడుతూ కళలు మనోవికాసానికే గాకుండా మనిషి మంచి ప్రవర్తనకు దోహదపడతాయన్నారు. అనంతరం వివిధ కళలకు చెందిన కళాకారులకు పట్టాభి పురస్కారాలు అందజేశారు. సభకు కళాపీఠం అధ్యక్షుడు టి.రాజేంద్ర ప్రసాదు అధ్యక్షత వహించారు.

చక్కటి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలి

గుంటూరు మెడికల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మధుమేహ బాధితులు సముతుల్య ఆహారం తీసుకుంటూ, శారీరక వ్యాయామం చేస్తూ తగిన మందులు వాడితే సంతోషకర మైన జీవితం గడపవచ్చని ప్రముఖ వైద్యుడు డాక్టర్ జీ సమరం తెలిపారు. ఆదివారం బ్రాడీపేటలోని సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సంస్థలో మధుమేహంపై జరిగిన అవగాహన సభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. అనంతరం షుగర్ రోగులు ఆహారం పై, ఇతర అంశాలపై అడిగిన సందేహాలను డాక్టర్ సమరం నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజల్లో ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ సేవకుమా ర్‌ను ఆయన అభినందించారు.

టీడీపీ సభ్యత్వం తీసుకోవడం గర్వకారణం : మంత్రి పెమ్మసాని

గుంటూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో తెలుగువాడు ఎక్కడున్నా తాను తెలుగుదేశంపార్టీ కుటుంబసభ్యుడినని చెప్పుకోవటం గర్వంగా ఉంటుందని కేంద్ర గ్రామీణా భివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని పెమ్మసాని కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆయన చేతుల మీదుగా సభ్యత్వాన్ని పునరుద్ధరిం చుకున్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేని నిర్మాణ వ్యవస్థ, కార్యకర్తల బలం తెలుగుదేశంపార్టీ సొంతమని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధినేత చంద్రబాబుని సైతం అక్రమంగా అరెస్టు చేయటంతో పాటు అనేక మంది టీడీపీ కార్యకర్తలను హత్యలు చేసినా, అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపినా దీటుగా ఎదుర్కొని పోరాడి పార్టీని అధికారంలోకి తెచ్చిన ఘన త కార్యకర్తలదేనని అన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం యువనేత నారా లోకేశ్ అనేక కార్య క్రమాలు చేపట్టారని, సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే గుంటూరు పార్లమెంటు ముందుండే విధంగా నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ముత్తినేని రాజేష్, తాళ్ల వెంకటేష్, బెల్లంకొండ సురేష్, మర్రి శివయ్య తదితరులు పాల్గొన్నారు.



కనపర్తి సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తున్న మంత్రి పెమ్మసాని

విద్యార్థుల్ని ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

● ఫీజు రీయింబర్స్‌మెంట్ కళాశాలల ఖాతాలకే చెల్లిస్తాం ● బకాయిలు విడతలవారీగా చెల్లించేందుకు ఏర్పాట్లు ● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాసంస్థలకు ఈ విద్యా సంవ త్సరంలో(2024)- కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాని కారణంగా విద్యార్థులకు హాల్ టికెట్లు నిలిపివేయడం, తరగతులకు, ప్రాక్టికల్, సెమిస్టర్ పరీక్షలకు హాజ రుకాకుండా యాజమాన్యాలు ఇబ్బంది పెట్టరాదని, అలా ఇబ్బందులు పెట్టినట్లు తమ దృష్టికి వస్తే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ కారణంగా కొన్ని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టిక్కెట్లు ఇవ్వడానికి నిరాకరించడం, తరగతులు, ప్రాక్టికల్స్‌కు హాజరు కాకుండా అడ్డుకోవడం వంటి విషయాలు జిల్లా యంత్రాంగం దృష్టికి వచ్చిందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేరుగా కాలేజీ లకు విడుదల చేస్తామని, గత బకాయిలను కూడా క్రమంగా విడుదల చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినందున విద్యార్థులెవరికి హాల్ టికెట్లను తిరస్కరించకుండా, తరగతులు, ప్రాక్టికల్స్ మొదలైన వాటికి హాజరును నిరోధించకుండా సంబంధిత విద్యాశాఖ అధికారులు వారి పరిధిలో గల కళాశాలల యాజమాన్యాలకు ఖచ్చితమైన సూచనలు జారీ చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి

● కల్నల్ ఎస్ఎం కల్నల్ చంద్రశేఖర్ ● ఘనంగా ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు(తూర్పు), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి జీవితంలో క్రమశిక్షణ, సమాజంపై బాధ్యత అలవర్చుకోవాలని గుంటూరు గ్రూప్ కమాండర్



ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రారంభిస్తున్న కల్నల్ చంద్రశేఖర్

కల్నల్ ఎస్ఎం కల్నల్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక శ్యామలానగర్‌లో ఎన్‌సీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజానికి సేవ చేయాలనే భావాన్ని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందని అన్నారు. అందుకే దేశంలోని పాఠశాల స్థాయి నుంచి కళాశాలలో చదివే వివిధ రకాల విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్యాడెట్లకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గుంటూరు, విజయవాడ, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల ఎన్‌సీసీ యూనిట్ల అసోసియేటెడ్ అధికారులు, క్యాడెట్స్, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవా కార్యక్రమాలు

గుంటూరు(విద్య), నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జాతీయ ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా చౌడవరంలోని ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. పలకలూరు రోడ్డులోని డాక్టర్ కొండబోలు బసవ పున్నయ్య



పలకలూరులోని వృద్ధాశ్రమంలో ఆర్వీఆర్‌అండ్‌జేసీ ఎన్‌సీసీ క్యాడెట్లు

ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాలను సందర్శించి, వృద్ధులకు పండ్లు, రొట్టెలు, బిస్కెట్లను పంపిణీ చేశారు. పలకలూరు తదితర గ్రామాల్లోని పలు వీధుల్లో పర్యటించి పరిసరాల శుభ్రతపై అవగాహనా ర్యాలీని నిర్వహించి, చెత్తను ఏరి పరిసరాలను శుభ్రం చేశారు, విద్యార్థులను కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీ మోహన్, డాక్టర్ జగదీష్, కె.మద్దినేని తదితరులు అభినందించారు. కార్యక్రమాల్లో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్స్ లెఫ్టినెంట్ డాక్టర్ తారా చాంద్, లెఫ్టినెంట్ డాక్టర్ ఉషా క్రాంతి, ఆర్మీ హవాల్దార్ బసవరాజ్ పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సులతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

● ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ



మాట్లాడుతున్న డాక్టర్ డీఆర్ శర్మ

గుంటూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ యూనివర్సిటీలకు భిన్నంగా ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం(ఇగ్నో) కోర్సులు అందిస్తుందని, ఈ కోర్సులు యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఉపయోగపడతాయని ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ డీఆర్ శర్మ అన్నారు. ఆదివారం టీజేపీఎస్ కళాశాలలో ఇగ్నో స్టడీసెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్సులను సత్వరం పూర్తి చేయడానికి ప్రత్యేక స్టడీ సెం టర్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. వర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం వసంతరావు మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇచ్చిన అసైన్‌మెంట్స్, పరీక్షల ప్రిపరేషన్ వర్కును సమర్థవంతంగా పూర్తిచేస్తే మెరుగైన ఫలితాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సెంటర్ కోఆర్డినేటర్ ఏ భాను మురళీధర్, డాక్టర్ పీ దేవేంద్రగుప్త, వై మార్కండేయులు, టీజేపీఎస్ కళాశాల అసి స్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బీవీహెచ్‌కే శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దీన్ దయాళ్ క్షేత్రంలో అరకొర ఉత్పత్తితో

ఓఎన్‌జీసీకి తిప్పలు



రోజుకు కేవలం 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ గ్యాస్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ తీరంలోని కృష్ణా-గోదావరి (కేజీ) బేసిన్‌లో ఉన్న దీన్ దయాళ్ సహజ వాయువు క్షేత్రం.. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఓఎన్‌జీసీకి పెద్ద గుదిబండలా మారింది. భారీ గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయనే పేరుతో గుజరాత్ ప్రభుత్వ రంగ సంస్థ గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (జీఎస్‌పీసీఎల్) ఈ గ్యాస్ ఫీల్డ్‌ను 2017 జూలైలో ఓఎన్‌జీసీకి అంటగట్టింది. అంతకు ముందే జీఎస్‌పీసీ ఈ సహజ వాయు క్షేత్రంలో తనకున్న 80 శాతం వాటాలో 50 శాతం ఇస్తానన్నా ఓఎన్‌జీసీ తిరస్కరించింది. అయితే 2017కు వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. దీన్ దయాళ్ ఫీల్డ్ ఈక్విటీలో తనకున్న మొత్తం 80 శాతం వాటాను జీఎస్‌పీసీ.. ఓఎన్‌జీసీకి రూ.7,738 కోట్లకు విక్రయించింది.

అంతా 'గ్యాసే'

జీఎస్‌పీసీఎల్ ఈ గ్యాస్ ఫీల్డ్‌లో 20 లక్షల కోట్ల ఘనపుటడుగుల (టీసీఎఫ్) గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్టు, దీన్నుంచి రోజూ 20 కోట్ల ప్రామాణిక ఘనపుటడుగుల (ఎంఎస్‌సీఎఫ్‌పీడీ) గ్యాస్ ఉత్పత్తి చేయవచ్చని మొదట్లో గ్యాస్ కొట్టింది. ఓఎన్‌జీసీకి తన 80 శాతం వాటా అమ్మే నాటికే జీఎస్‌పీసీ ఈ క్షేత్రంలో మూడు గ్యాస్ బావులు తవ్వింది. ఓఎన్‌జీసీ చేతికి వచ్చాక మరో ఏడు బావులు తవ్వారు. సాంకేతిక సమస్యలతో ఇందులో మూడు బావుల డ్రిల్లింగ్ మధ్యలోనే ఆపేశారు. పూర్తి చేసిన మిగతా నాలుగు బావుల్లోనూ రోజువారీ గ్యాస్ ఉత్పత్తి 1.45 ఎంఎస్‌సీఎఫ్‌పీడీ మించడం లేదు.

ఖర్చు బారెడు

తన చేతికి వచ్చాక ఓఎన్‌జీసీ.. దీన్ దయాళ్ క్షేత్రం ఫీల్డ్ అభివృద్ధి కోసం పెద్ద మొత్తమే ఖర్చు చేసింది. ఈ కొనుగోలుతో జీఎస్‌పీసీఎల్ మాత్రం తన అప్పుల భారం కుదించుకుంది. ఓఎన్‌జీసీ మాత్రం తన మిగులు నిధుల్లో ఎక్కువ భాగం ఇందుకోసం ఖర్చు చేయాల్సి వచ్చింది. మంచి ఆర్థిక స్థోమత, టెక్నాలజీ ఉన్న ఏదైనా సంస్థ ముందుకు వస్తే భాగస్వామ్యంతో దీన్ దయాళ్ గ్యాస్ ఫీల్డ్‌ను అభివృద్ధి చేయాలని ఓఎన్‌జీసీ చూస్తోంది. అందుకు కూడా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో ఈ గ్యాస్ ఫీల్డ్ ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీకి పెద్ద భారంగా మారింది.

బీమా సుగమ్ కోసం రూ.500 కోట్లు

ముంబై: భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) తలపెట్టిన 'బీమా సుగమ్' ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బీమా మంథన్ సదస్సులో బీమా కంపెనీలు ఈ అంచనాకు వచ్చినట్టు సమాచారం. అన్ని రకాల బీమా పాలసీల మార్కెటింగ్, ఇతర సేవలు ఒకే చోట అందించేందుకు ఐఆర్‌డీఏఐ ఈ సింగిల్ విండో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను తలపెట్టింది. ఇందుకు రూ.100 నుంచి రూ.200 కోట్లు ఖర్చవుతుందని మొదట్లో అంచనా వేశారు. తాజా అంచనాల ప్రకారం ఇందుకు ఎంతలేదన్నా రూ.500 కోట్లు ఖర్చవుతుందని కంపెనీలు ఒక అంచనాకు వచ్చాయి. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభానికల్లా దీన్ని అమలు చేయాలని ఐఆర్‌డీఏఐ యోచిస్తోంది.

24,300 పైన బుల్లిష్

(నవంబరు 25-29 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

టెక్ వ్యూ

నిఫ్టీ గత వారం 24,956-23,263 పాయింట్ల మధ్యన కదలాడి 375 పాయింట్ల లాభంతో 23,907 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,300 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,562, 23,644, 23,909, 24,482 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా దిగువకు రావడం దీర్ఘకాలిక బేరిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,300 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,400

నిరోధ స్థాయిలు: 24,100, 24,200, 23,400 (24,000 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,700, 23,500, 23,400 (23,800 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	580	విజయవాడ	595
వరంగల్	582	గోదావరి	595
చిత్తూరు	603	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	108
వరంగల్	107	గుంటూరు	103
కరీంనగర్	107	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	75
కర్నూలు	107	నెల్లూరు	75
విశాఖపట్నం	120	అనంతపురం	75
గోదావరి	108		

హీరో, జీరో భాగస్వామ్యంలో కొత్త ఈ-బైక్

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ భాగస్వామ్యంలో హీరో మోటో కార్ప్ రూపొందిస్తున్న మిడ్ పెర్ఫార్మెన్స్ విద్యుత్ బైక్ అభివృద్ధి అడ్వాన్స్‌డ్ దశలో ఉన్నదని చెబుతున్నారు. ఎలక్ట్రిక్ బైక్‌ల తయారీలో పేరెన్నిక గన్న కాలిఫోర్నియాకు చెందిన జీరో మోటార్ సైకిల్స్ 6 కోట్ల డాలర్ల ఈక్విటీ పెట్టుబడులు పెట్టేందుకు హీరో మోటో కార్ప్ డైరెక్టర్ల బోర్డు 2022 సెప్టెంబరులో ఆమోదించింది. తమ భాగస్వామ్యంలో ప్రీమియం విద్యుత్ బైక్‌లు రూపొందిస్తామని 2023లో రెండు కంపెనీలు ప్రకటించాయి. ఈ భాగస్వామ్యంలో మిడ్ పెర్ఫార్మెన్స్ ఈ- బైక్ అభివృద్ధి దశలో ఉన్నదని హీరో మోటో కార్ప్ సీఈఓ నిరంజన్ గుప్తా తెలిపారు.

డిసెంబరులోనూ ఐపీఓల జోరు

10 ఇష్యూలు.. రూ.20,000 కోట్ల సమీకరణ!

నూఢిల్లీ: సెకండరీ మార్కెట్ ఆటుపోట్లలో ఉన్నా, ప్రైమరీ మార్కెట్ జోరు తగ్గడం లేదు. వచ్చే నెల కూడా 10 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)ల ద్వారా రూ.20,000 కోట్లు సమీకరించేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో సూపర్ మార్కెట్ చెయిన్ విశాల్ మెగా మార్ట్, బ్లాక్‌స్టోన్ నిర్వహణలోని డైమండ్ గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమ్మోలాజికల్ ఇనిస్టిట్యూట్ (ఇండియా) లిమిటెడ్, హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే సాయి లైఫ్ సైన్సెస్ కూడా ఉన్నట్టు మర్చంట్ బ్యాంకింగ్ వర్గాలు చెప్పాయి. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, యూపీ ఉప ఎన్నికల ఫలితాలతో ఐపీఓ మార్కెట్ సెంటిమెంట్ పెరుగుతుందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. కాగా ఈ వారం రాజేష్ పవర్ సర్వీసెస్ సహా మొత్తం ఆరు పబ్లిక్ ఇష్యూలు ప్రారంభమవుతుండగా ఎన్‌టీపీసీ గ్రీన్‌తో పాటు మరో మూడు కంపెనీలు మార్కెట్లో లిస్ట్ కానున్నాయి.

లాభాల బాటలోనే.!

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అంతర్జాతీయంగా సానుకూల సంకేతాలు, డాలర్ దూకుడు తగ్గటం, చైనా ఉద్దీపన పథకంతో పెద్దగా ప్రయోజనాలు లేకపోవటం, విదేశీ సంస్థాగత మదుపరులు మళ్లీ తిరిగొచ్చే సూచనలు, అదానీపై కోర్టు అభియోగాల ప్రభావం తగ్గిపోవటమే ఇందుకు కారణాలు. గత శుక్రవారం సెషన్ ఇన్వెస్టర్లలో ఆత్మవిశ్వాసం నింపింది. ఫండమెంటల్స్ బలంగా ఉన్న షేర్లు ఆకర్షణీయమైన ధరల్లో లభిస్తుండటంతో కొనుగోళ్లు పెరిగే అవకాశం ఉంది. మహారాష్ట్రలో బీజేపీ విజయం కూడా పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపింది.

స్టాక్ రికమండేషన్స్

జుబిలెంట్ ఫుడ్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ షేరు మెరుగ్గా రాణిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. తాజా త్రైమాసిక ఫలితాలు మెరుగ్గా ఉండటం, ఈపీఎస్ పెరగటంతో మూమెంటమ్ కనిపిస్తోంది. జీవితకాల గరిష్ఠం తర్వాత ఈ షేరు కొంత దిద్దుబాటుకు లోనైంది. ప్రస్తుతం ఈ షేరు అక్యుములేషన్ జోన్‌లో ఉంది. గత శుక్రవారం 4.5 శాతం లాభంతో రూ.637 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.630/600 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.675/690 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.580 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పేటీఎం: పేమెంట్ బ్యాంక్ సేవలకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) అనుమతి ఇచ్చినప్పటి నుంచి ఈ షేరు అప్‌ట్రెండ్‌లో దూసుకుపోతోంది. నష్టాల మార్కెట్లోనూ పటిష్ఠతను సూచించింది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా బాగుంది. ప్రస్తుతం కీలక రెసిస్టెన్స్ జోన్ వద్దకు చేరుకుంటోంది. దాన్ని బ్రేక్ చేస్తే ఇక తిరుగులేదు. గత శుక్రవారం 6.5 శాతం లాభంతో రూ.900 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.880 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.960/990 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.860 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఫీనిక్స్ మిల్స్ లిమిటెడ్: ఈ షేరు జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత 33 శాతం మేర పతనమైంది. తాజాగా మళ్లీ పెరుగుతూ వస్తోంది. చివరి నాలుగు సెషన్లలో ఏకంగా 18 శాతం పెరిగింది. గత శుక్రవారం 5.33 శాతం లాభంతో రూ.1,616 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.1,600 స్థాయిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,560 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రియా లైఫ్ సైన్సెస్: ఐపీఓ ఇష్యూ ధర నుంచి 70 శాతం మేర పతనమైన ఈ షేరు గత ఏడాది మార్చి నుంచి టర్న్ అరౌండ్ అయ్యాయి. అప్పటి నుంచి బుల్‌రన్ కొనసాగుతోంది. ప్రస్తుతం ఈ షేరుకు ఐపీఓ గరిష్ఠ స్థాయి వద్ద మద్దతు లభించింది. సేల్స్, ఈపీఎస్, డెలివరీ వాల్యూమ్ క్రమంగా పెరుగుతున్నాయి. గత శుక్రవారం 14 శాతం లాభంతో రూ.806 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.780 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.860/890 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.750 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

విజయ డయాగ్నోస్టిక్స్: ప్రస్తుతం ఈ షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిలో కదలాడుతోంది. మెరుగైన ఫలితాలు ప్రకటించటం, ఈపీఎస్, సేల్స్ పెరగటంతో మూమెంటమ్ పెరిగింది. బడా ఇన్వెస్టర్లు అక్యుములేట్ చేసుకుంటున్నారు. చివరి మూడు సెషన్లలో 25 శాతం పెరిగిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,160 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

24,000 ఎగువన నిలదొక్కుకోవడం కీలకం

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం ప్రారంభంలో డౌన్ ట్రెండ్‌ను కొనసాగిస్తూ 23,300 కన్నా దిగజారినా శుక్రవారం ఏర్పడిన బలమైన రికవరీలో 560 పాయింట్ల మేరకు లాభపడింది. చివరికి గత వారంతో పోల్చితే 375 పాయింట్ల లాభంతో 23,900 సమీపంలో ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ ఎనిమిది వారాల డౌన్ ట్రెండ్ అనంతరం రిలీఫ్ ర్యాలీ సాధించింది. అయితే మార్కెట్ ఇప్పటికీ మద్దతు స్థాయిల కన్నా పైనే ఉంది. మార్కెట్ నిట్టనిలువుగా బౌన్స్‌బ్యాక్ సాధించినందు వల్ల స్పష్టమైన సందేశం ఇవ్వాలంటే కన్సాలిడేట్ కావడం తప్పనిసరి. అయితే ఈ రివర్సల్‌తో తక్షణ డౌన్‌ట్రెండ్ ముప్పును మాత్రం తప్పించుకుంది. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 975 పాయింట్లు, స్మాల్ క్యాప్-100 సూచీ 155 పాయింట్లు లాభపడ్డాయి. ఈ వారంలో నిఫ్టీ మరింత పాజిటివ్‌గానే ప్రారంభం కావచ్చు. ఈ క్రమంలో 24,000 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత పాజిటివ్ సంకేతం ఇవ్వాలంటే నిఫ్టీ తదుపరి నిరోధం 24,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ స్థాయిలు 24,350, 24,550. ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: ఏ మాత్రం బలహీనత ప్రదర్శించినా మద్దతు స్థాయి 24,000 వద్ద కన్సాలిడేషన్ తప్పనిసరి. భద్రత కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 23,800, 23,500.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం ఈ సూచీ 950 పాయింట్ల మేరకు రికవరీ సాధించి చివరికి 51,000 కన్నా స్వల్పంగా పైన క్లోజైంది. మరింత సానుకూలత కోసం తదుపరి నిరోధం 51,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,200. ప్రస్తుత మద్దతు స్థాయి 51,000 వద్ద నిలదొక్కుకోవడంలో విఫలమైతే బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 49,400.

పాటర్న్: నిఫ్టీ గత వారం 200 డీఎంఏ వద్ద రికవరీ సాధించింది. ఇప్పుడు నిరోధ స్థాయి 24,100 సమీపంలో గల 25 డీఎంఏ వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు. ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి. మార్కెట్ గత వారం ఓవర్‌సోల్డ్ స్థితి నుంచి కోలుకుంటున్నట్టు కనిపిస్తోంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,000, 24,155
మద్దతు	24,000, 23,920



నవ్య | చిత్రజ్యోతి



ఆ కోరికను పుష్ప 2 తీర్చింది

'పుష్ప చిత్రం అంతర్జాతీయ స్థాయిలో నాకు నటుడిగా గుర్తింపును ఇచ్చింది. డిసెంబర్ 5న వస్తున్న 'పుష్ప 2: ది రూల్' చిత్రంతో దేశవ్యాప్తంగా వైల్డ్ ఫైర్ రాబోతోంది. మూడేళ్లు నా జీవితాన్ని ఈ సినిమాకు అంకితం చేశాను. హీరో అయినప్పటి నుంచి చెన్నైలో నా సినిమా కార్యక్రమం ఒక్కటైనా చేయాలనుకుంటున్నాను. ఆ కోరికను 'పుష్ప 2' తీర్చింది' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన హీరోగా సుకుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'పుష్ప 2: ది రూల్'. ఆదివారం చెన్నైలో 'వైల్డ్ ఫైర్' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో అల్లు అర్జున్, శ్రీలీల నర్తించిన ప్రత్యేక గీతాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీలీల మాట్లాడుతూ 'రష్మిక తక్కువ సమయంలోనే నా మనసుకు దగ్గరయ్యారు. తను నన్ను చాలా బాగా ప్రోత్సహించారు. అల్లు అర్జున్ పాట కావడంతో బాగా కష్టపడ్డాను' అని చెప్పారు. రష్మిక మందన్న మాట్లాడుతూ 'పుష్ప' కు ముందు తర్వాత అనేలా నా కెరీర్ మారింది. నా జీవితంలో మర్చిపోలేని జ్ఞాపకంగా ఈ చిత్రం మిగిలిపోతుంది' అన్నారు.

ఖరీదైన కానుకలు ఇచ్చా



ఇటీవలే అమెజాన్ ప్రైమ్‌లో విడుదలైన వెబ్ సిరీస్ 'హనీ బన్నీ'తో ప్రేక్షకులను పలకరించారు సమంత. ఈ వెబ్ సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె హీరో వరుణ్ ధావన్‌తో 'స్పైసీ ర్యాపిడ్ ఫైర్' అనే సరదా సంభాషణలో పాల్గొన్నారు. 'ట్రూత్ అండ్ డేర్' గేమ్‌లా ఉండే ఇందులో.. వరుణ్ అడిగిన దానికి సమాధానం చెప్పాలి.. చెప్పలేకపోతే పచ్చిమిర్చి తినాలి. 'మీరు ఏ వస్తువుల కోసం డబ్బులు అనవసరంగా ఖర్చు చేశారు' అని వరుణ్ అడిగారు. "నా ఎక్స్‌కు ఇచ్చిన కానుకల కోసం' అని సమంత సమాధానమిచ్చారు. 'అవునా.. ఎంత ఖర్చైంది' అని వరుణ్ అడగ్గా.. 'కొంచెం ఎక్కువే.. ఇక, తరువాతి ప్రశ్నకు పోదామా' అని సమంత బదులిచ్చారు. 'మీరు ఈ కార్యక్రమానికి వచ్చే ముందు ఎవరికి చివరగా మెసేజ్ చేశారు. దాన్ని పైకి చదివి వినిపిస్తారా' అని వరుణ్ అడగ్గా.. ఆ ప్రశ్నకు సమాధానమివ్వని సామ్ పచ్చిమిర్చి తిన్నారు.

ప్రేమంటారా? కాదంటారా?



ప్రేమలో ఉన్నామని పైకి చెప్పకపోయినా తరచూ చెట్టాపట్టాల్ వేసుకొని తిరుగుతూ కెమెరాలకు చిక్కుతున్నారు విజయ్‌దేవరకొండ, రష్మిక మందన్న. తాజాగా ఈ జంట మరోసారి అభిమానుల దృష్టిని ఆకర్షించింది. వీరిద్దరూ కలసి ఓ రెస్టారెంట్‌లో భోజనం చేస్తున్న ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. చెన్నైలో నిర్వహించిన 'పుష్ప 2' కార్యక్రమంలో 'మీ ప్రేమ, పెళ్లి గురించి చెప్పండి' అని యాంకర్ రష్మికను అడగ్గా 'తొందరెందుకు 'పుష్ప 2' విడుదలయ్యాక మీరే చూస్తారు కదా' అని బదులిచ్చారు. ఇండస్ట్రీకి చెందిన వ్యక్తా, బయట వ్యక్తా అని అడిగితే 'అది అందరికీ తెలిసిన విషయమే కదా' అంటూ స్పందించారు.





గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టాకాల్వకు 3506 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల (ఆంధ్రజ్యోతి), నవంబరు 24: విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 3506 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.8 అడుగుల నీటి మట్టం ఉండగా, దిగువకు 25,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 252 క్యూసెక్కుల నీరు, రేపల్లె కాల్వకు 522 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 56 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 51 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 196 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 1960 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

యూటీఎఫ్
జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక


యు.రాజశేఖర్, ఎం కళాధర్

గుంటూరు(విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఎన్జీవో కల్యాణ మండపంలో జిల్లా స్వర్ణోత్సవాల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యు.రాజశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం కళాధర్, గౌరవాధ్యక్షుడిగా పీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా జీ వెంకటేశ్వర్లు సహాధ్యక్షురాలిగా జీవీ నాగమణి, కోశాధికారి ఎండీ గయాసుదౌలా, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కే సాంబశివరావు, జీ వెంకటేశ్వరరావు, టీ ఆంజనేయులు, ఎం గోవిందు, కే కేదార్‌నాథ్, ఎండీ షకీలా బేగం, కే కామాక్షి, కే రంగారావు, బీ ప్రసాదు తదితరులు ఎన్నికయ్యారు.

మద్దతు ధరకు
ధాన్యం కొనుగోలు చేయాలి

● సీపీఎం నేత జొన్నా శివశంకర్

తాడేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని సీపీఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరులో ధాన్యం కల్లాల వద్ద పలువురు రైతులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన క్వింటాల్ ధాన్యం రూ.2340 ప్రకారం 75 కేజీల ధాన్యానికి రూ.1740 ఇవ్వాల్సి ఉండగా, రూ.1350-1400లకే రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం అన్యాయమని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం ప్రకటించిన ధర ప్రకారం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి చేయాలి

మంగళగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి పార్టీ నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు పిలుపునిచ్చారు. మంగళగిరి మండల వైసీపీ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం బైపాస్ రోడ్డులోని వైసీపీ నియోజకవర్గ కార్యాలయంలో పాటిబండ్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ హనుమంతరావు మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ ఇబ్బంది వచ్చినా పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం ప్రతి మండలం, గ్రామం, వార్డు కమిటీలను త్వరలోనే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసరావు

పెదనందిపాడు, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పోలింగ్ బూత్‌ల వద్ద బూత్‌లెవల్ అధికారులు ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల, పీఏఎస్ కళాశాలలో ఉన్న నాలుగు పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. చేర్పులు మార్పులకు సంబంధించిన ఫారంలను జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఓట్లు నమోదులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరీముల్లా, సీనియర్ అసిస్టెంట్ యోహోషువా, వీఆర్వో అనిల్, ఏవో తదితరులున్నారు.

చినపాలెం అడ్డరోడ్డులో
మద్యం దుకాణాన్ని తరలించాలి

దుగ్గిరాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చినపాలెం అడ్డరోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థినులు ఇదే మార్గం గుండా నిత్యం గ్రామానికి రావలసి ఉంటుందని, బస్సు, ఆటోలు దిగి మహిళలు ఇదేమార్గం గుండా నడిచివెళ్లాల్సి ఉందని, మద్యం దుకాణం తమ గ్రామ శివారులో ఏర్పాటు చేయవద్దని, కొందరు మహిళలు, స్థానిక రైతులు రెండ్రోజుల క్రితం ఆందోళన చేసిన విషయం విదితమే. మద్యం దుకాణం బస్ షెల్టర్ సమీపంలో ఉండటంతో అక్కడే కూర్చొని మద్యం తాగుతున్నారని, దుకాణాన్ని ప్రజలకు ఇబ్బందులు లేని చోటుకు తరలించాలని, లేకుంటే, ఆందోళన చేపడతామని గ్రామస్థులు చెబుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కరువు

● వెంటాడుతున్న దొంగల భయం
● ఎంఈవో కార్యాలయంలో ఇప్పటికే జరిగిన చోరీలు
● మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణానికి లేని భద్రత
● తాజాగా తాళాలు పగులగొట్టి దొంగతనానికి యత్నం

ప్రత్తిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలకు రక్షణ కరువైంది. ఈ ప్రాంగణంలో అగ్రిల్యాబ్‌తో పాటు ఎంఈవో కార్యాలయం, ప్రత్తిపాడు సచివాలయం, హౌసింగ్ కార్యాలయాలు ఉన్నాయి. అంతే కాకుండా మండల పరిషత్ కార్యాలయంలోనే వెలుగు, ఎన్ఆర్ఈజీఎస్, ఏఈలకు సంబంధించిన ఆఫీసులు కూడా ఉన్నాయి. ఒకే ప్రాంగణంలో ఉన్న ఇన్ని కార్యాలయాలకు రాత్రి పూట భద్రత పూర్తిగా కరువైంది. చుట్టూ ఉన్న ఫెన్సింగ్ చాలా వరకు పాడై పోయింది. దీనికి తోడు ప్రధాన గేటు కూడా ఉపయోగంలేకుండా ఉంది. ఎవరైనా రాత్రి పూట లోపలకు వెళ్లే అవకాశం ఉంది. ఊరికి చివర ఉండటంతో గతంలో పలు అసాంఘిక కార్యకలాపాలు కూడా జరిగేవి. ఇటీవల కాలంలో దొంగ తనాలు విపరీతంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పలు మార్లు మండల విద్యావనరుల కేంద్రం తలుపుల తాళాలు పగలగొట్టి పలు విలువైన సామగ్రిని దొంగలు అపహరించారు. తాజాగా శుక్రవారం రాత్రి కూడా ఇదే కార్యాలయం తలుపు పగలగొట్టారు. అయితే విలువైన వస్తువులు ఏమీ లేకపోవడంతో దొంగలు ఏమి తీసుకపోలేదు. అయితే ఇక్కడ ఉన్న అన్ని కార్యాలయాల్లో కంప్యూటర్లు ఉన్నాయి. అంతే కాకుండా అగ్రిల్యాబ్‌లో లక్షల రూపాయల విలువ చేసే పరికరాలు ఉన్నాయి. కేవలం ఎంఈవో కార్యాలయంలోని టీవీలు వంటివే ఇప్పటికి దొంగిలించారు. ఇప్పటికైనా రాత్రి పూట వాచ్‌మన్‌ను నియమించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలు

నైట్ వాచ్‌మన్ లేకపోవడమే..

ఈ ప్రాంగణానికి నైట్ వాచ్‌మెన్ లేకపోవడమే దొంగతనాలకు ప్రధాన కారణంగా కనిపిస్తుంది. గతంలో మండల పరిషత్ కార్యాలయాలకు నైట్ వాచ్‌మన్ పోస్టులు ఉండేవి. కాని ఆ తరువాత ఆ పోస్టులను రద్దు చేసి అటెండర్‌లుగా ఉంచారు. అప్పటి నుంచి ఈ కార్యాలయాలకు భద్రత లేకుండా పోయింది. ప్రస్తుతం మండల పరిషత్ కార్యాలయంలో నలుగురు అటెండర్లు ఉన్నారు. నైట్ వాచ్‌మెన్ పోస్టు లేదని ప్రత్తిపాడు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు.

గుంటూరు ఛానల్ సమస్యను పరిష్కరించాలి

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి నల్లమడ రైతుసంఘ నాయకుల వినతి


కేంద్ర సహాయమంత్రి పెమ్మసానికి వినతిపత్రం అందజేస్తున్న నల్లమడ రైతు సంఘనాయకులు

పెదనందిపాడు, నవంబరు, 24 (ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించాలని కోరుతూ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆదివారం గుంటూరులోని ఆయన కార్యాలయంలో నల్లమడ రైతు సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. గుంటూరు ఛానెల్ యామర్రు నుంచి పర్చూరు వరకు పొడింపునకు నిధులు కేటాయించి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేసి కాలపరిమితితో కూడిన ప్రణాళికతో నాలుగు మండలాలకు తాగు, సాగునీరు అందేలా కృషిచేయాలన్నారు. నల్లమడ వరద ముంపునకు శాశ్వత పరిష్కారం కోసం 2016లో ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారని, గత ప్రభుత్వం కనీసం జంగిల్ క్లియరెన్స్ పనులు కూడా చేపట్టలేదని, దీని వల్ల వరదలు వచ్చి రైతులు పంటలు నష్టపోయి, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. గుంటూరు ఛానెల్ పొడిగింపు కోసం పెదనందిపాడులో శాంతియుతంగా నిరసన కార్యక్రమం చేపడితే 29 మంది మహిళలు, రైతులపై అక్రమంగా కేసులు పెట్టారని వాటిని వెంటనే ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లమడ రైతు సంఘ నాయకులు కొల్లా రాజమోహనరావు, మొవ్వా పెద్దన్న, వీరయ్యచౌదరి, హరిబాబు, ఎం వెంకయ్యచౌదరి, ఈదర భ్రమరాంబ, దొప్పలపూడి మంజూష, కొల్లా నిర్మల, లావు అంకమ్మ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు ఇవ్వాలి : సీపీఐ నేతలు


ప్రకాష్‌నగర్‌లో పేదల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లి టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు కేటాయించాలని సీపీఐ తాడేపల్లి పట్టణ సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య కోరారు. ఆదివారం ప్రకాష్‌నగర్‌లో ఇళ్లు లేని పేదల నుంచి అర్జీలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇళ్లు లేని పేదల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పట్టణాల్లోని పేదలకు రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటికి స్థలం కేటాయించి, ఇళ్లు తామే స్వయంగా నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శివ, దుర్గాప్రసాద్, షేక్ బాషా, అమినా, ఆశ, లక్ష్మి పాల్గొన్నారు.

అమరావతి పునర్నిర్మాణాన్ని కాంక్షిస్తూ శత చండీ హోమం


రాజధాని అమరావతి శంకుస్థాపన ప్రదేశంలో శత చండీ యాగంలో పాల్గొన్న అమరావతి రైతులు, మహిళలు

తుళ్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణాన్ని కాంక్షిస్తూ అమరావతి హిందూ ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఉద్దండ్రాయునిపాలెంలోని రాజధాని శంకుస్థాపన జరిగిన ప్రదేశంలో శత చండీ యాగాన్ని ఆదివారం నిర్వహించారు. జగన్ రెడ్డి అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర రాజధాని అమరావతి నిర్వీర్యం అయ్యింది. మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి కావటంతో అమరావతికి పూర్వవైభవం వచ్చింది. ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్మాణ పనులు వేగవంతం కావాలని, దైవ శక్తి విశేషంగా ఉండాలని యాగం చేసినట్టు అమరావతి హిందూ పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ గణేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, రాజధాని రైతు జేఏసీ నేత పువ్వాడ సుధాకరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రైతులు, మహిళలు, రైతు కూలీలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి

సీపీఎం మండల కార్యదర్శి రమేష్‌బాబు

పెదనందిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సౌరవిద్యుత్ కుంభకోణం కేసులో గౌతమ్ అదానీని తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. సీపీఎం దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఆదివారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ అమెరికాలో అదానీపై కేసు నమోదైందని, దీనిపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం హాస్యాస్పదమన్నారు. తక్షణమే వారికి కేటాయించిన భూములను రద్దు చేయాలని, ప్రభుత్వం ప్రజల కోసం పనిచేయాలని.. కార్పొరేటర్ల కోసం పని చేయకూడదని హితవు పలికారు. ప్రభుత్వాలు వ్యవసాయ, విద్యుత్ రంగాలను అదానీ, అంబానీలకు కట్టబెడుతున్నారని, దీంతో దేశం సంక్షోభంలోకి వెళ్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, నల్లమోతు రాజేంద్ర, వీ భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ, విజయలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

వాపు చూసి బలం అనుకుంటున్న బీజేపీ : పాశం రామారావు


ప్రసంగిస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

తాడేపల్లి టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న బీజేపీ తమ విజయాన్ని వాపు చూసి బలం అనుకుంటోందని వాస్తవంగా బీజేపీకి బలం తగ్గిందని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు అన్నారు. ఆదివారం మేకా అమరారెడ్డి భవన్‌లో జరిగిన తాడేపల్లి పట్టణ మహాసభలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఇబ్బంది పెట్టిన ప్రతిచోటా ప్రతిపక్షాల అభ్యర్థులు గెలుపొందారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను విచ్చల విడిగా అమ్మివేస్తున్నారన్నారు. ఒకే దేశం ఒకే ఎన్నిక ఒకే నేత అంటూ జమిలి ఎన్నికల పేరుతో అధ్యక్ష పాలనకు తెరతీస్తుందని ఇది దేశ ఫెడరల్ రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. వాడవాడలా వెలసిన బెల్టు షాపులపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఎం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు వై నేతాజీ, ఎం రవి, జొన్నా శివశంకర్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం పట్టణ కార్యదర్శిగా బూరుగ వెంకటేశ్వర్లు

తాడేపల్లి సీపీఎం పట్టణ కార్యదర్శిగా నాలుగోసారి సీపీఎం సీనియర్ నేత ప్రకాష్‌నగర్‌కు చెందిన బూరుగ వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణ కార్యదర్శివర్గ సభ్యులుగా గాదె సుబ్బారెడ్డి, దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి, కె.కరుణాకర్‌రావు, కమిటీ సభ్యులు పి గిరిజ, డి విజయభాస్కర్‌రెడ్డి, ఎం శ్రీనివాస రెడ్డి, బర్నబాస్, శౌరి బర్తొలోం, బాబూరావు, దర్శనపు విజయబాబు ఎన్నికయ్యారు. తొలుత ఇటీవల మృతి చెందిన సోలా ముత్యాలరావుకు నివాళులర్పించారు.

విద్యుదాఘాతంతో
ఆరోగ్యకేంద్రంలో ఫైల్స్ దగ్ధం

ఫిరంగిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం -3 లోని ఎస్టీ కాలనీలో మంచి నీటి చెరువు దగ్గర ఉన్న ఆరోగ్య కేంద్రంలో ఆదివారం విద్యుదాఘాతంతో ఫైల్స్ కాలిపోయాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సీఐ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు

ఫిరంగిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) మండలంలో స్పెషల్ సమ్మరి రివిజన్ 2025లో భాగంగా ఆదివారం జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు నమోదు చేసుకోవటానికి ప్రత్యేక శిబిరాలను ఫిరంగిపురం, అమీనాబాద్, వేములూరిపాడు, నుదురుపాడు, మేరికపూడి, రేపూడి, గొల్లపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహసీల్దార్ ప్రసాదరావు తన సిబ్బందితో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతీ వయోజనుడు ఓటు హక్కు కలిగి ఉండేలా బీఎల్‌వోలు తదితర అధికారులు కృషి చేయాలని ఆయన కోరారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో తెలంగాణ రైతుల సందర్శన


రేవేంద్రపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో జీవామృతం, బీజామృతాల తయారీని పరిశీలిస్తున్న తెలంగాణా రైతులు

దుగ్గిరాల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రేవేంద్రపాడు, పెదపాలెం గ్రామా ల్లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను తెలంగాణా రాష్ట్రం వరంగల్, నల్గొండ జిల్లాలకు చెందిన రైతులు ఆదివారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన పంటలు పండించి, విజయాలను సాధిస్తున్న స్థానిక రైతులను కలిసి వివరంగా తెలుసుకున్నారు. రేవేంద్రపాడు రైతు నాగిని, పెదపాలెం రైతు కృష్ణ ప్రసాద్, నూతక్కి రైతు ఉషారాణిలు సాగు చేస్తున్న ప్రకృతి వ్యవసాయక్షేత్రాల్లో జీవామృతం, బీజామృతం, విత్తన గుళికల తయారీ గురించి తెలుసుకున్నారు. అరటి, పసుపు చేలను సైతం సందర్శించి ప్రకృతి వ్యవసాయ సాగుపద్ధతులను రైతులతో పంచుకున్నారు. రైతుసాధికార సంస్థ ప్రతినిధి ప్రకాష్, శ్రీనివాస్, హుమాయూన్, సతీష్, ప్రకృతి వ్యవసాయశాఖ సహాయ సిబ్బంది, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

రాజధాని రైతులు, కార్మికులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాబూరావు


ప్రసంగిస్తున్న సీహెచ్ బాబూరావు

తాడేపల్లి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు ఇస్తున్న అప్పును కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలని, రాజధాని రైతులు, కార్మికులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. ఉండవల్లిలో వల్లభాపురం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులకు నిలిపివేసిన సామాజిక పెన్షన్ ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని సౌర విద్యుత్‌లో భారీ అవినీతికి పాల్పడిన అదానీని తక్షణమే అరెస్టు చేసి అతనితో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రద్దు చేయాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ అదాని అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాజధానిలో ప్రారంభించబోయే అభివృద్ధి పనుల్లో స్థానికులకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నేతలు ఈమని అప్పారావు, ఎం రవి, భాగ్యరాజు, సుందరరావు, నందాజీ, బాబూరావు, వల్లభాపురం వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీడీపీ సభ్యత్వ నమోదు


తుళ్లూరు టిడ్కో ఇళ్ల వద్ద టీడీపీ సభ్యత్వం నమోదు చేస్తున్న నాయకులు

తుళ్లూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): తుళ్లూరులో ఐదు రోజుల నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కొనసాగుతుంది. ఆదివారం టిడ్కో ఇళ్ల వద్ద టీడీపీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఫోన్‌లోనే సభ్యత్వం నమోదు చేసి ఐడీ కార్డును వారికి వాట్సప్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, మైనేని రామాంజనేయులు, గడ్డం వెంకటేశ్వరావు, కొల్లి నరేంద్ర, జమ్ముల హరికిరణ్, పరుచూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోటరీ ఇండియా లిటరసీ మిషన్ లో భాగంగా నేషన్ బిల్డర్స్ అవార్డుల ప్రదానోత్సవం ఆదివారం మంగళగిరిలో జరిగింది. ప్రభుత్వ, ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలకు చెందిన 29 మంది ఉపా ధ్యాయులను ఎంపిక చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎన్వీ రాంప్రసాద్, పీడీజీ అన్నె రత్నప్రభాకర్, ఎంఈవో ఎస్‌బాబు, అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ వంశీకృష్ణ, రొటేరియన్ టీవీ నారాయణ, మంగళగిరి అధ్యక్ష, కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్, ప్రాజెక్ట్ ఛైర్మన్ ప్రగడ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాలధారణతో దేవుడి అనుగ్రహం లభిస్తుంది

ఎమ్మెల్యే శ్రావణకుమార్


తుళ్లూరులో అయ్యప్ప పడిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రావణకుమార్

తుళ్లూరు, నవంబరు24(ఆంధ్రజ్యోతి) అయ్యప్ప మాలధారణతో దేవుడి అనుగ్రహం లభిస్తుందని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ఆదివారం రాత్రి తుళ్లూరులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు ఇంటి వద్ద జరిగిన అయ్యప్ప పడిపూజా మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గురుస్వాములు ఆశీర్వచనం అందించారు. అయ్యప్ప మాలాధారణ స్వాములు ఎంతో నియమ నిష్ఠలతో మండల దీక్ష చేసి స్వామి వారికి ఇరుముడులు చెల్లించుకొని అయ్యప్ప అనుగ్రహం పొందుతున్నార ని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యేతో పాటు పడిపూజా మహోత్సవంలో పాల్గొన్నారు. గురుస్వామి జమ్ముల వెంకటేశ్వరావు స్వామి ఆధ్వర్యంలో ఈ పడిపూజ జరిగింది. ఉద్దండ్రాయునిపాలెంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమంలో ఆదివారం ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఓటర్ల జాబితా సవరణ క్యాంపుల తనిఖీ


క్యాంపులను తనిఖీ చేస్తున్న అధికారి లక్ష్మీకుమారి

మంగళగిరి సిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి నియోజక వర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శని, ఆదివారాల్లో జరిగిన ఓటర్ల జాబితా సవరణ క్యాంపులను నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఏ లక్ష్మీకుమారి తనిఖీ చేశారు. మంగళగిరి, తాడేపల్లి పట్టణ, రూరల్ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి ఓటర్ల అభ్యర్థన మేరకు సంబంధిత ఫారాలను స్వీకరించాలని సూచించారు. కాగా, ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బూత్ లెవల్ అధికారులు ముసాయిదా ఓటర్ల జాబితాను ఓటర్లకు అందుబాటులో ఉంచారు. ఓటరు జాబితాలో మార్పు, చేర్పులు, కొత్త ఓట్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, పోలింగ్ బూత్ మార్పు కోసం ఓటర్ల నుంచి అర్జీలను స్వీకరించారు.

పునీతశౌరి వారి తిరునాళ్లకు శ్రీకారం


ప్రార్థనలు నిర్వహిస్తున్న ఫాదర్ దిలీప్ తదితరులు

వట్టిచెరుకూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని ముట్లూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన పునీతశౌరి వారి తిరునాళ్ల మహోత్సవం డిసెంబరు 3న జరుగనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం దేవాలయంపై జెండా ఆవిష్కరణతో తిరునాళ్లకి శ్రీకారం చుట్టారు. తొలుత దేవాలయం నుంచి పలువురు ఫాదర్లతో స్థానిక ఫాదర్ దిలీప్‌కుమార్ ఊరేగింపుగా స్థానిక సెయింట్ జేవీఆర్ హైస్కూల్ ప్రాంగణంలోని పునీతశౌరి వారి స్తూపం వద్ద ముఖ్యఅతిధి పునీతశౌరి వారి జీవిత చరిత్రను వివరిస్తూ తిరునాళ్ల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా హైస్కూల్ విద్యార్థులు, గ్రామస్థులు, దేవాలయ పెద్దలు కొవ్వొత్తులతో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం హైస్కూల్ ప్రాంగణం నుంచి ఆలయ పెద్ద జెండాను చేత బూని ఊరేగింపుగా దేవాలయానికి చేరుకొని యూనివర్సల్ కాలేజీ డైరెక్టర్ పామిశెట్టి బాలస్వామి ముఖ్యఅతిధిగా జెండాను ఆవిష్కరించారు.

విద్యార్థులు విశ్వ క్రీడల్లో రాణించాలి

● ఆర్‌సీజేసీ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం మోజెస్



ఫుట్‌బాల్ క్రీడాకారులతో విశ్రాంత ప్రిన్సిపాల్ మోజెస్ తదితరులు

ఫిరంగిపురం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ క్రీడల్లో ప్రపంచంలో రాణించే విధంగా ఫిరంగిపురం నుంచే ప్రయత్నించాలని ఆర్‌సీజేసీ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం మోజెస్ అన్నారు. ఆదివారం ఫిరంగిపురంలోని మార్నింగ్ స్టార్ కళాశాల క్రీడా మైదానంలో మండల స్థాయి అండర్ - 14, 19 ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ బాలబాలికల పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడారు. విద్యతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే క్రమశిక్షణతో, ఆరోగ్యంతో ఉన్నత స్థానాలు పొందగలరన్నారు. రాష్ట్ర ఉత్తమ క్రీడా విశ్రాంత ఉపాధ్యాయులు జెట్టి సురేంద్రబాబు మాట్లాడుతూ ఈ మైదానంలో ఫుట్‌బాల్ నేర్చుకొని జాతీయ స్థాయి పోటీల్లో క్రీడల్లో రాణించిన వారు అనేక మంది ఉన్నారన్నారు. కష్టపడి ఫిటెనెస్‌తో క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో పోటీల్లో పాల్గొనే జట్లకు టాస్ వేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రభుదాసు, నాని, సురేష్ పాల్గొన్నారు.

రైతు రుణ ఉపశమన చట్టాన్ని అమలుచేయాలి

దుగ్గిరాల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేరళ తరహాలో రైతురుణ ఉపశమన చట్టాన్ని అమలు చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి జొన్నా శివశంకర్ అన్నారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రైతుల, కార్మిక సంఘాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, మండలంలోని చిలువూరు, తుమ్మపూడి గ్రామాల్లో రైతుసంఘాలు, కౌలురైతు సంఘాల నాయకులు ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. శివశంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా 500 జిల్లా కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రం తీసుకువచ్చిన మూడు లేబర్‌కోడ్‌ల స్థానంలో తీసుకువచ్చిన నాలుగో లేబర్ కోడ్‌ను తక్షణమే రద్దుచేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10వేల పింఛన్‌ను అమలు చేయాలని తదితర అంశాలకు సంబంధించి కరపత్రాన్ని ప్రజలకు అందించారు. మన్నవ నాగమల్లేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, అమ్మిరెడ్డి, బాలచంద్రుడు, వెంకటేశ్వరరావు, ఎం మంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఏఎస్ కళాశాలలో ఘనంగా ఎన్‌సీసీడే


ఎన్‌సీసీ కేడట్లతో ప్రిన్సిపాల్ కె వీరరాఘవయ్య, తదితరులు

పెదనందిపాడు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలలో ఎన్‌సీసీ డే ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య మాట్లాడుతూ విద్యార్థులు ఎన్‌సీసీలో చేరడం వల్ల నాయకత్వ లక్షణాలు, సేవాతత్వం, క్రమ శిక్షణతోపాటు ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎన్‌సీసీ విద్యార్థులకు కళాశాల పాలకవర్గ సభ్యులు కాళహస్తి సత్యనారాయణ(విశ్రాంత ఏఎస్‌సీ), నర్రా బాలకృష్ణ, లావు ఆదిశేషయ్యలు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఏఎన్‌వో కెప్టెన్ పాతూరి శ్రీనివాసరావు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పురపాలక సంఘ అత్యవసర సమావేశం

తెనాలి, మారీసుపేట, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ అత్యవసర సమావేశం నేడు సోమవారం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం గం.11లకు కౌన్సిల్‌హాల్‌లో జరగనున్న సమావేశంలో అజెండాలోని 25అంశాలను సభ్యుల ఆమోదం కోసం ఉంచడం జరుగుతుందన్నారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్‌లు, ఎక్స్ అఫిషియో మెంబరు, కో ఆప్షన్ మెంబర్లు, అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొనాలని చైర్‌పర్సన్ కోరారు.

ఎమ్మెల్యే ధూళిపాళ్ళకు సముచిత స్థానం కల్పించాలి : బ్రాహ్మణ మహా సభ

పొన్నూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌కు సముచిత స్థానం కల్పించాలని బ్రాహ్మణ మహా సభ తీర్మానం చేసి ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపారు. ఆదివారం స్థానిక శంకర్ మఠంలో బ్రహ్మణ మహా సభ ఆధ్వర్యంలో బ్రాహ్మణ కార్తిక వన సమారాధన జరిగింది ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పొన్నూరుకు బ్రాహ్మణ సమాజానికి చేస్తున్న సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు. కార్యక్రమంలో మహా సభ నాయకులు గనపవరపు రామశాస్త్రి, పులిపాక ప్రసాద్, కె. మంగనాథరావు, హరిహరపంత్, తాండవ కృష్ణమూర్తి, దేశరాజ్ తిలక్, ఆవుదాలపల్లి సాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: ఐదేళ్ల వైసీపీ పాలనలోని అరాచకాలకు ఎదురొడ్డినిలిచి పార్టీని, కార్యకర్తలను, సంగం డెయిరీని కాపాడుకుంటూ వచ్చిన నాయకుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అని సంగంజాగర్లమూడి కూటమి నాయకులు కొత్తరమేష్ బాబు చెప్పారు. ఆదివారం సంగంజాగర్లమూడి హైస్కూల్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. పొన్నూరు నియోజవర్గంలో వైసీపీ పాలనలో చేయని అరాచకాలు లేవన్నారు. కార్యకర్తలపై అక్రమకేసులు, దాడులకు సైతం పాల్పడినా నియోజవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న నరేంద్రకుమార్ వాటన్నింటిని ధైర్యంగా ఎదుర్కొని పార్టీని కేడర్‌ను కాపాడుకుంటూ వచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం నరేంద్ర సేవలను గుర్తించి ఆయనకు సముచిత స్థానం కల్పించాలని రమేష్ బాబు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు విజ్ఞప్తి చేశారు.

పాఠశాలల్లో నిరుపయోగంగా ఫ్లాట్ ప్యానల్స్



పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫ్లాట్ ప్యానల్

● ప్రతి తరగతి గదికి ఒక పరికరం
● వేధిస్తున్న ఇంటర్‌నెట్ సమస్య

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ నిరుపయోగంగా ఉంటున్నాయి. గత ప్రభుత్వం విద్యా బోధనకు గాను ఉపయోగించుకునేందుకు ప్రతి ఉన్నత పాఠశాలలో వీటిని ఏర్పాటుచేసింది. అయితే వీటిని బిగించేందుకు, వాడేందుకు అవసరమైన ఇంటర్‌నెట్ సదుపాయాలకు మాత్రం డబ్బులు ఇవ్వకుండా వదిలేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతి సెక్షన్‌లో ఒక ప్యానల్‌ను తరగతి గదిలో ప్రస్తుతం నల్ల బల్ల ఉన్న చోట వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో పాఠశాలలో 5 నుంచి 20 వరకు ప్యానల్స్ ఏర్పాటుచేసి వాటి నిర్వహణ ఇతరత్రా సౌకర్యాలను అందించకపోవడంతో రూ.కోట్ల ప్రజాధనం పనికి రాకుండా పోయింది. వాస్తవానికి ఇంటర్‌నెట్ సదుపాయం బాగా ఉంటే వీటిని ఉపాధ్యాయులు తమ బోధనలో ఉపయోగించుకుని విద్యా బోధనను మెరుగుపరుచుకునేవారు. విద్యార్థులకు పాఠ్య బోధనలో వివిధ అంశాలను చెప్పడంతో పాటు వాటిని పరోక్షంగా చూపించేందుకు ప్యానల్స్ ఎంతగానో ఉపయోగపడతాయి. యూట్యూబ్‌లో వీడియోలను, విశ్లేషణలను, మెరుగైన అనుభవజ్ఞులైన వారి బోధనను, యానిమేషన్ చిత్రాలను విద్యార్థులకు చూపిస్తే వారికి పాఠ్యాంశాలు మదిలో మరింతగా నాటుకునే అవకాశం ఉంటుంది. సైన్స్ ప్రయోగాలు, సాంఘిక శాస్త్ర మ్యాప్‌లు, చారిత్రక అంశాలు, రాజకీయ విశేషాలు, స్వాతంత్ర్య సమరం వంటి వాటిని హృదయానికి హత్తుకునేలా ఉపయోగించవచ్చు. అయితే ఇంటర్‌నెట్ సదుపాయం లేకపోవడంతో వీటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారు. ప్రతి ఉన్నత పాఠశాలకు ఇంటర్‌నెట్ కనెక్షన్ ఉన్నప్పటికీ అవి కార్యాలయం వరకు మాత్రమే పరిమితమవుతోంది. నెల నెలా ఇంటర్‌నెట్ చార్జీలు కూడా ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులే కొంత భరిస్తున్నారు. ప్రతి తరగతికి ఫ్లాట్ ప్యానల్ స్పీడ్ ఇంటర్‌నెట్‌తో పాటు ఎక్కువ నెట్ కనెక్షన్లు అవసరమవుతాయని చెబుతున్నారు. గత ప్రభుత్వం రెండేళ్ల పాటు పాఠశాలల నిర్వహణకు రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదు. రూ.కోట్లు వెచ్చించి ప్యానల్స్ కొనుగోలు చేసి రూ.వేల ఖరీదు చేసే నెట్ సౌకర్యం కల్పించకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఫ్లాట్ ప్యానల్స్ కొనుగోలులో కమిషన్ల కోసం కక్కుర్తిపడి మాత్రమే వీటిని ఏర్పాటు చేయడానికి శ్రద్ధ చూపారని, ఇంటర్‌నెట్ వంటి సౌకర్యాలను కల్పించడంలో గత పాలకులు విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. దీంతో వీటి వినియోగం అంతంత మాత్రంగానే ఉంది. ప్యానల్స్ ఏర్పాటుచేసి నెట్ సౌకర్యం కోసం ఇచ్చిన పరికరాలు కనెక్షన్లు లేక, అందుకు తగిన డబ్బులు చెల్లించలేక వృథాగా మూలుగుతున్నాయి. సాంకేతిక నైపుణ్యం ఉన్న వారు లేకపోవడంతో ఇచ్చిన పరికరాలను సక్రమంగా అమర్చే పని కూడా లేకుండా పోయింది. విద్యాశాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్యానల్స్ వినియోగానికి అవసరమైన పూర్తి స్థాయి ఇంటర్‌నెట్, నిధులు, సాంకేతిక నిపుణులను ఇచ్చి వాటిని సద్వినియోగం చేసేలా చూడాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాల సేకరణ

ప్రస్తుత ప్రభుత్వం ఇంటర్‌నెట్ సౌకర్యం లేని పాఠశాలల వివరాలు సేకరిస్తోంది. ప్రతి ఏటా విద్యా ప్రణాళికలు రూపొందించేందుకు ప్రతి నవంబరులో నివేదిక తీసుకుంటోంది. ప్రతి పాఠశాల నుంచి ప్రధానోపాధ్యాయులు పలు అంశాలను యూడైస్‌లో పొందుపరుస్తుంటారు. నాలుగు అంశాలలో వివరాలు సేకరించిన ప్రభుత్వం ఇంటర్‌నెట్ సౌకర్యాల వివరాలకు గాను తాజాగా మరో అంశాన్ని పొందుపరిచింది. ఆయా పాఠశాలలు ఉన్న ప్రాంతాలలో అందుబాటులో ఉన్న ఇంటర్‌నెట్ ప్రొవైడర్లను మొదటి, రెండవ ప్రాధాన్య అంశాలుగా నమోదు చేయడం జరిగింది. ఏ పాఠశాలకు ఎన్ని ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్స్ సరఫరా అయ్యింది, అవి పని చేస్తున్నదీ లేనిదీ వివరాలు కోరింది. తద్వారా త్వరితగతిన వివరాలు సేకరించి తగినంత ఇంటర్‌నెట్ సామర్థ్యాన్ని అందించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

నిఘా నీడలో పొన్నూరు పట్టణం

● అర్బన్ సీఐ రవికిరణ్



పొన్నూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పురపాలక సంఘంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని అర్బన్ సీఐ రవికిరణ్ ఆదివారం ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

ప్రశ్న: రౌడీ షీటర్ల నిరోధానికి ఏం చర్యలు తీసుకున్నారు.

జవాబు: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని 39మంది రౌడీ షీటర్లు ఉన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాం. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రతి నెలా కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఎలా పరిష్కరిస్తారు?

జ: పొన్నూరు పట్టణంలో ప్రధాన సమస్య ట్రాఫిక్. ఈ సమస్య పరిష్కారానికి పురపాలక సంఘం అధికారులతో కలిసి సమన్వయంతో ముందుకు సాగుతున్నాం. పొన్నూరు పట్టణంలో రోడ్డు మార్జిన్ల వెంట వీధి వ్యాపారులు అధికంగా ఉన్నారు. రోడ్డు ఆక్రమణలకు గురికాకుండా ట్రాఫిక్ అవరోధం ఏర్పడకుండా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ప్రశ్న: ఈవ్ టీజింగ్ నిరోధానికి తీసుకుంటున్న చర్యలు?

జ: పొన్నూరు పట్టణంలో ఆకతాయుల బెడద నిరోధించటానికి విజువల్ పోలీసింగ్‌ను ఏర్పాటు చేస్తున్నాం. కళాశాలల వద్ద, రద్దీ ప్రదేశాల్లో పోలీస్ సిబ్బందిని నియమించి ఆకతాయిల బెడదపై ఆరా తీస్తున్నాం.

ప్రశ్న: పట్టణంపై నిఘా ఎలా?

జ: పొన్నూరు పట్టణంలో ఇప్పటికే 70 సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి అసాంఘిక శక్తుల కదలికలను ఆరా తీస్తున్నాం. మరో 60 ప్రాంతాలో కెమెరాలు అవసరమైనట్లు గుర్తించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సహకారంతో సోషల్ రెస్పాన్సిబిలిటీ పథకంలో కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం.

ప్రశ్న: అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి తీసుకున్న చర్యలు ఏంటి ?

జ: పొన్నూరులో ఇప్పటికే రేషన్ బియ్యం మాఫియాకు అడ్డుకట్ట వేశాం. గంజాయి, మట్కా నిర్వాహకులపై కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ ఇచ్చాం. 37మందిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్‌చేసి పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న: సిబ్బంది కొరత ఉందా?

జ: పొన్నూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, 36మంది సిబ్బంది ఉన్నారు. మరో 10మంది అవసరం. ఆ పది మంది సిబ్బందిని కేటాయిస్తే ట్రాఫిక్ విభాగానికి కేటాయించి ట్రాఫిక్ నిరోధానికి చర్యలు చేపడతాం.

రాష్ట్రాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి: మంత్రి అనగాని



మంత్రి అనగాని, ఆర్టీసీ చైర్మన్ నారాయణ, ఎమ్మెల్యే ధూళిపాళ్ళను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

చేబ్రోలు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని రాష్ట్ర మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలో ఆదివారం గుంటూరు జిల్లా గౌడ సంఘం, గీత బంధు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన జరిగింది. ఈ సమారాధనకు ముఖ్య అతిథిగా హాజరైన రెవెన్యూ మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ గౌడ సంఘీయులు ఐకమత్యంగా ముందుకు సాగాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతునట్లు చెప్పారు. మరో ముఖ్యఅతిథి ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ గౌడ సంఘీయులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కోరారు. మరో అతిథి స్థానిక ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ సర్దార్ గౌత్ లచ్చన్న గొప్పతనాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. అనంతరం ముఖ్యఅతిథులను నిర్వాహకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కన్వీనర్ వీరంకి రంగారావు, జిల్లా వ్యాప్తంగా ఉన్న గౌడ సంఘీయులు పాల్గొన్నారు.

తెనాలిలో కార్తీక వనసమారాధనల సందడి



అగ్నికుల క్షత్రియ వనసమారాధనలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి, వేదికపై ఎంపీ మోపిదేవి

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం కార్తీక వన సమారాధనలను సందడిగా నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో బోసురోడ్డులోని నూకల రామకోటేశ్వరరావు కళ్యాణ మండపంలో నిర్వహించిన వన సమారాధనలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు పాల్గొన్నారు. సైకం లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అజయ్, రమణ, వెంకట్రావు, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు. మారీసుపేట శివాలయ కళ్యాణ మండపంలో తెనాలిలో నివసిస్తున్న గోవాడ గ్రామస్తుల కార్తీక వనసమారాధన నిర్వహించారు. మార్కెట్ యార్డులో నిర్వహించిన కాపు కార్తీక వనసమారాధనలో మాజీ శాస్త్రవేత్త చందు సాంబశివరావు, తోటకూర వెంకటరమణరావు, చందు సాంబశివుడు, గ్యాలం వేణు, హరిదాసు గౌరీశంకర్, వల్లెం మురళి, సుబ్రహ్మణ్యం, చందు రామారావు, లింగంశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. బాలాజీరావుపేట వినాయకుని ఆలయం వద్ద చెరుకూరి రమేష్‌బాబు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రావి కృష్ణమోహన్, లక్ష్మీనారాయణ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. చెంచుపేట రామకృష్ణ మనోహర్ ఆశ్రమంలో వైఖానస సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు.

● తెనాలి మారీసుపేట: శ్రీవిద్యాపీఠం, శ్రీ సాలిగ్రామ మఠం ట్రస్ట్ వారు సంయుక్తంగా కార్తీక వనసమారాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులో ఆదివారం శ్రీ విద్యాపీఠం ట్రస్ట్ నూతనంగా నిర్మించనున్న సరస్వతి దేవాలయ ఆవరణలో బాలస్వామి స్వయం పర్యవేక్షణలో కార్తీక మాస వనసమారాధన మహోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరి కృష్ణమూర్తి, సెక్రటరీ రావూరి సుబ్బారావు, గడ్డిపాటి శ్రీనివాసరావు, ముద్దాభక్తుని రమణయ్య, గోపు రామకృష్ణ, పెనుకొండ వెంకటేశ్వరావు, కోన నాగేశ్వరావు, సాలిగ్రామ మఠం, శ్రీ విద్యాపీఠం కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

● తెనాలి మారీసుపేట: జంగము సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నందులపేట బసవ మందిరం వద్ద ఆదివారం జంగము సంక్షేమ సంఘం అధ్యక్షుడు కాకాని నాగలింగం ఆధ్వర్యంలో 13వ కార్తీక మాస వనసమారాధన మహోత్సవాన్ని సంఘ సభ్యులచే వైభవంగా నిర్వహించారు.

● తెనాలి రూరల్: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వనసమారాధన కార్యక్రమం సందడిగా నిర్వహించారు. మండలంలోని అంగలకుదురులో తెనాలి మానవత చైర్మన్ కొలసాని రామ్‌చంద్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో శాస్త్ర ప్రకారం ఉసిరి చెట్టుకు పూజలు జరిపి హోమాది పూజలు నిర్వహించారు. అనంతరం మానవత సంస్థ కుటుంబసభ్యులతో వనభోజనాన్ని స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా జరిగాయి.



అన్నాభిషేకంలో సహస్రలింగేశ్వర స్వామి

సహస్రలింగేశ్వర స్వామికి అన్నాభిషేకం

పొన్నూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలోని శైవ క్షేత్రం శ్రీ సహస్రలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని సహస్రలింగేశ్వరస్వామికి ఏకాదశ రుద్రాభిషేకాలు, పంచామృత అభిషేకాలు జరిగాయి, అనంతరం స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ ప్రత్యేక పూజలను ఆలయ ఈవో గద్దె వెంకటఅమర్‌నాథ్ పర్యవేక్షించారు.



కల్యాణ పూజలందుకున్న మల్లేశ్వరి స్వామి

భక్తి శ్రద్ధలతో మల్లేశ్వరస్వామి కల్యాణం

పొన్నూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చింతలపూడిలోని గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పవిత్ర కార్తీక మాసంలో స్వామివారి అభిషేకాలు ఆలయంలో ప్రతి రోజూ నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు మంత్ర జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. కల్యాణ మహోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన జాగర్లమూడి బంగారుబాబు కుటుంబ సభ్యులు స్వామివారికి నంది వాహనాన్ని బహూకరించారు. చింతలపూడి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తజనులు ఈ కల్యాణ మహోత్సవానికి హాజరై వీక్షించారు. అనంతరం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో స్వామి వారి అన్న ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

ధ్యానంతో ప్రశాంత జీవితం సాధ్యం

తెనాలి రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో ప్రశాంతత, ఆరోగ్యకరమైన జీవితం సాధ్యమవుతుందని హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ మరియు శ్రీరామచంద్రమిషన్ జోనల్ కో-ఆర్డినేటర్ ఎస్ రామకోటేశ్వరరావు చెప్పారు. ఆదివారం మండలంలోని కొలకలూరులో హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ మరియు శ్రీరామచంద్ర మిషన్ ఏపీ-ఐసీ03 జోన్ ఆధ్వర్యంలో ఆశ్రమంలో మినీ భండారా తరహాలో ఫుల్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. గుంటూరు, తెనాలి, బాపట్ల, చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ, మాచర్ల, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, పొన్నూరు, రేపల్లె తదితర సెంటర్లకు చెందిన 850మందికి పైగా పాల్గొని మూడు ధ్యాన సత్సంగ్‌ల ద్వారా ఎన్నో విశేషాలను అభ్యాసకుల ద్వారా తెలుసుకున్నారు.

షుగర్ వ్యాధిపై అవగాహన అవసరం

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): షుగర్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డాక్టర్ పి.శారద పేర్కొన్నారు. శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెం రోడ్డులోని సేవా కేంద్రంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 5 గంటలకే రోగులు రావడంతో వారందరికి అల్పాహారం పంపిణీ చేశారు. రక్త పరీక్షలు, బీపీ, బరువు చూసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తగిన ఆహార అలవాట్లు, వ్యాయామం చేయడం ద్వారా షుగర్‌ను, బీపీని అదుపులో ఉంచుకోవచ్చన్నారు. 200మందికి పైగా రోగులు సేవలందించారు.

వైకుంఠపురంలో ఘనంగా సత్యదేవ వ్రతాలు

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైకుంఠపురం ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసంలో నాల్గవ ఆదివారం 192మంది వ్రతంలో పాల్గొన్నారు. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో నిత్య కల్యాణ మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాన్ని అర్చకులు నాగమారుతి, రత్నాకరం సత్యనారాయణ గౌతమ్, అళహరి రవి నిర్వహించారు. వ్రత ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈవో అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కె.సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

వాసవీ ఆలయంలో కోటి దీపోత్సవం

తెనాలి అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం రాత్రి కోటీ దీపోత్సవం నిర్వహించారు. శ్రీవాసవీ మాత ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పెద్ద ఎత్తున మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నూకల వేణుగోపాలరావు, మద్దాళి యశ్వంత్, రామబ్రహ్మం, దిలీప్‌కుమార్, సురేంద్ర, వెంకటేష్, ప్రణీత్ తదితరులు పర్యవేక్షించారు.

చీటిపాట డబ్బు అడిగితే బెదిరింపులు



తెనాలి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేటకు చెందిన హారిక గత పది సంవత్సరాలుగా చీటి పాటలు నిర్వహిస్తోంది. ఇదే ప్రాంతానికి చెందిన రెహన్‌బేగం హారిక వద్ద చీటిపాట పాడుకుని మరి కొంత నగదు అప్పుగా తీసుకుంది. ఈ మొత్తం రూ.2.50 లక్షల వరకు చేరింది. దీనిని చెల్లించమంటే బెదిరింపులకు దిగుతుందని హారిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ పోలీసులు తెలిపారు.

ఫోన్ తీసుకుని లోన్ యాప్‌లతో రూ.4 లక్షలకు మోసం

తెనాలి క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నమ్మకంగా ఫోన్ తీసుకుంటూ లోన్ యాప్‌ల ద్వారా రూ.4 లక్షలు కాజేశాడని ఓ మహిళ వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆదివారం వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక నాజరుపేట జంధ్యాలవారి వీధిలో నివసించే ముద్రబోయిన సాంబశివరావు, భార్య తులసి వీరు తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారితో పాటు తాపీ పనులకు వచ్చే కాటూరి రాజేష్ అనే వ్యక్తి వీరికి క్రెడిట్ కార్డు ఇప్పిస్తానని వారి వద్ద నుంచి ఫోన్‌ను అప్పుడప్పుడు వాడుకుంటూ ఈ ఫోన్ ద్వారా లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని ఈ యాప్ ద్వారా వచ్చే డబ్బును తన ఫోన్ అకౌంట్‌కి మళ్లించుకున్నాడు. వాటిలో వచ్చే మెసేజ్‌లు తొలగించేవాడు. ఈ నెల 1వ తేదీన తులసి ఫోన్‌కి కొత్త నెంబరు నుంచి మీరు లోన్ డబ్బులు కట్టాలంటూ వేధింపులు రావడంతో దీనిపై బాధితులు వివరాలు తెలుసుకోగా 16యాప్‌ల ద్వారా కాటూరి రాజేష్ రూ.4 లక్షలకు పైగా నగదు డ్రా చేసుకున్నట్లు ఆధారాలతో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



దాత కొత్త వెంకయ్యచౌదరి విగ్రహ ఆవిష్కరణలో రమేష్‌బాబు, శివరామకృష్ణ, పూర్వఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు

విద్యాభివృద్ధికి పాటుబడిన వెంకయ్యచౌదరి

తెనాలి రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యనభ్యసించి గొప్పస్థాయిలో నిలవాలన్న సంకల్పంతో దివంగత కొత్త వెంకయ్యచౌదరి హైస్కూల్ నిర్మాణానికి దాదాపు 18ఎకరాల భూమిని అందించి విద్యాదాతగా లక్షలాదిమంది విద్యార్థుల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కొత్త రమేష్‌బాబు చెప్పారు. ఆదివారం మండలంలోని సంగంజాగర్లమూడిలో కొత్త వెంకయ్య చౌదరి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991-1992 పదవతరగతి బ్యాచ్ పూర్వవిద్యార్థుల సహకారంతో ఏర్పాటు చేసిన దాత కొత్తవెంకయ్య చౌదరి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

క్లుప్తంగా...

● కొల్లిపర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మున్నంగిలో గంగానమ్మ అమ్మవారి కొలుపులు ఘనంగా ముగిశాయి. కొలుపులను పురస్కరించుకుని గంగానమ్మ ప్రతిరూపమైన ఘటాన్ని ఆదివారం గ్రామంలో ఊరేగించి గంగానమ్మ ఆలయం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం భక్తులు వేలాదిగా తరలి వచ్చి తమ మొక్కుబడులను తీర్చుకున్నారు.

● తెనాలి అర్బన్ : మహారాష్ట్ర ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయంపై బీజేపీ కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక గాంధీచౌక్‌లో ఆదివారం మిఠాయిలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు అనంతాచార్యులు, కామేశ్వరరావు, నారాయణరావు, కనకదుర్గ, కళావతి, హిమబిందు, కిషోర్, కుశల్‌జైన్, వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: చెంచుపేట రామకృష్ణ మనోహర్ ఆశ్రమంలో ఆదివారం వైఖానస సంఘం కార్తీక వన సమారాధన నిర్వహించారు. సంస్కృతంలో ఐదు గోల్డ్ మెడల్ సాధించిన యశ్వంత్ దీక్షితులను ఘనంగా సన్మానించారు. సంఘ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసమూర్తి అధ్యక్షతన యువ వైఖానస అసోసియేట్స్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు.

● కొల్లిపర: మండల పరిధిలోని అత్తోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నేత్ర వైద్యవిభాగం, ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో ఉచిత కంటి శుక్ల నిర్ధారణ శిబిరం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో నేత్ర వైద్యాధికారి మేరియా, డాక్టర్లు రమ్య, మౌనిక, ఎంపీటీసీ బొల్లిముంత వెంకటేశ్వరరావు, దాసరి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి అర్బన్: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఆదివారం కవిరాజా పార్కులో నిర్వహించారు. మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆధ్యాత్మిక వేత్త అప్పికట్ల వెంకటేశ్వరరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.



సమస్య ఇది.. స్పందించరూ

ప్రమాదకరంగా ఎండిన చెట్టు

● పట్టించుకోని అధికారులు

కొల్లిపర మండలం పిడపర్తిపాలెం నుంచి మున్నంగి వెళ్ళేదారిలో చిన్న కరకట్ట సమీపంలో ఉన్న చెట్టు కూలటానికి సిద్ధంగా ఉంది. చెట్టు నిలువునా ఎండిపోయి సంవత్సరాలు తరబడి కావస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఏ క్షణానైనా రోడ్డుపై ప్రయాణించేవారిపై పడే అవకాశం ఉంది. ఆ చెట్టును తొలగించి ప్రమాదం నుంచి కాపాడాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

- కొల్లిపర, ఆంధ్రజ్యోతి

సీఎం సహాయ నిధితో ఆదుకుంటాం: ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య బాధితులను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆదుకుంటామని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. మండల పరిధిలోని చింతలపూడిలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు నరేంద్ర కుమార్ అందచేశారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి గ్రామానికి చెందిన చింతలపూడి రామాంజనేయులుకు రూ.96,490, పట్టణంలోని నిడుబ్రోకు చెందిన కాటూరి దేవేంద్రనాథ్‌కు రూ.78,636, సాంబశివనగర్ కాలనీకి చెందిన షేక్ దిల్షాద్‌బేగంకు రూ.1,21,329లు నగదు చెక్కులను ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ ఖర్చుతో కూడుకున్న వైద్యం పేదలకు అందుబాటులో ఉంచాలని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా పెద్దఎత్తున వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా మంజూరు కాని వైద్య సేవలను ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పట్టణ, మండలానికి చెందిన టీడీపీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు (విద్య), నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఎన్జీవో కల్యాణమండపంలో జిల్లా స్వర్ణోత్సవాల సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యు.రాజశేఖర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా ఎం కళాధర్, గౌరవాధ్యక్షుడిగా పీవీ శ్రీనివాసరావు, సహాధ్యక్షుడిగా జీ వెంకటేశ్వర్లు సహాధ్యక్షురాలి గా జీవీ నాగమణి, కోశాధికారి ఎండీ గయా సుదౌలా, కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కే సాంబ శివరావు, జీ వెంకటేశ్వరరావు, టీ ఆంజనేయులు, ఎం గోవిందు, కే కేదార్‌నాథ్, ఎండీ షకీలా బేగం, కే కామాక్షి, కే రంగారావు, బీ ప్రసాదు తదితరులు ఎన్నికయ్యారు.